

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684



విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్ గిరి | సోమవారం | 16.03.2026 | సంపుటి: 3 | సంచిక: 44 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | MONDAY | 16.03.2026 | VOLUME : 3 | ISSUE : 44 | PAGES: 8 | COST: 2/- |


# మోగిన నగారా



- బంగాల్, కేరళ, తమిళనాడు, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల తేదీలను ప్రకటించిన భారత ఎన్నికల సంఘం
- అసోం: ఏప్రిల్ 9న పోలింగ్, కౌంటింగ్ మే 4న
- కేరళ: పోలింగ్ ఏప్రిల్ 9, కౌంటింగ్ మే4న.
- తమిళనాడు: పోలింగ్ ఏప్రిల్ 23, కౌంటింగ్ మే 4న.
- బంగాల్: పోలింగ్ ఏప్రిల్ 23, 29 తేదీల్లో .. కౌంటింగ్ మే 4.
- పుదుచ్చేరి: పోలింగ్ ఏప్రిల్ 9 , కౌంటింగ్ మే 4న

దేశంలోని నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతానికి అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, అసోంతో పాటు కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ఆదివారం విడుదల చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ అన్ని ప్రాంతాల్లో మే 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. వివరాల్లోకి వెళితే, పశ్చిమ బెంగాల్‌లోని 294 స్థానాలకు రెండు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఏప్రిల్ 23న తొలి దశ, ఏప్రిల్ 29న రెండో దశ పోలింగ్ నిర్వహిస్తారు. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో ఏప్రిల్ 23న పోలింగ్ జరగనుంది. ఇక అసోం (126), కేరళ (140), పుదుచ్చేరి (30) అసెంబ్లీ స్థానాలకు ఒకే దశలో ఏప్రిల్ 9వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు ఈసీ ప్రకటించింది.

వివరాలు 5వ పేజీలో



# నేటి నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు

- ఈ నెలాఖరు వరకు అసెంబ్లీ!
- ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రసంగం
- సమావేశాల నిర్వహణపై అధికారులు, కార్యదర్శులతో గుత్తా సుఖేందర్ రెడ్డి, గడ్డం ప్రసాద్ సమావేశం

హైదరాబాద్, మార్చి 15:

తెలంగాణ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 16న ఉదయం 11:45 గంటలకు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ప్రసంగిస్తారు. అనంతరం బీఏసీ సమావేశం నిర్వహిస్తారు. సభ ఎన్ని రోజులు నిర్వహించాలనే అంశంపై బీఏసీలో నిర్ణయం తీసుకుంటారు. ఈ నెల 20వ తేదీన శాసన సభలో, మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ నెలాఖరు వరకు బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.

వివరాలు 2వ పేజీలో

## మాజీ ఎమ్మెల్యే ఫాంహౌజ్‌లో డ్రగ్స్ పార్టీ కలకలం

- ఎంపీ సహా ఆరుగురికి పాజిటివ్
- పార్టీ చేసుకుంటున్నట్లు సమాచారంతో సోదాలకు వెళ్లిన ఈగల్ టీమ్
- ఈగల్ టీమ్‌ను అడ్డుకుని ఢిల్లీ రియల్ ఎస్టేట్ వ్యాపారి కాల్పులు
- ఆరుగురికి పాజిటివ్ వచ్చిందన్న ఈగల్ ఎస్పీ గిరిధర్



బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఫాంహౌజ్‌లో డ్రగ్స్ పార్టీ కలకలం రేపింది. పార్టీలో పాల్గొన్న 11 మందిలో ఆరుగురికి డ్రగ్స్ పాజిటివ్‌గా తేలింది. వారిలో తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డితో పాటు ఏపీలోని ఏలూరు ఎంపీ మహేశ్ కుమార్ యాదవ్ కూడా ఉండటం చర్చనీయాంశమైంది. శనివారం రాత్రి పోలీసులు సోదాలకు వెళ్లిన సమయంలో 11 మందిలో ఒకరు తుపాకీతో గాల్లోకి కాల్పులు జరపడం విస్మయానికి గురి చేసింది.

వివరాలు 2వ పేజీలో



## మిస్టర్ రంగనాథ్.. జాగ్రత్త

- నీ పై డిఫమేషన్ కేసు వేస్తా.. కోర్టుకు లాగుతా'
- హైడ్రా కమిషనర్‌కు కవిత వార్నింగ్

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు కల్వకుంట్ల కవిత వార్నింగ్ ఇచ్చారు. మిస్టర్ రంగనాథ్ మిమ్మల్ని కోర్టుకు ఈడ్చుకుని వెళ్తా జాగ్రత్త అంటూ వార్నింగ్ ఇచ్చారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆమె మీడియా సమావేశం నిర్వహించారు.

2లో




## అన్నదాతకు గుడ్ న్యూస్

- 22 నుంచి రైతు భరోసా నిధుల విడుదల
- నర్మెట్ట నుంచి విడుదల చేయనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



వివరాలు 3వ పేజీలో

## రాహుల్ గాంధీ భారత్‌ను, ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తున్నారు



- బీజేపీని, ప్రధానిని వ్యతిరేకించే క్రమంలో, దేశాన్నీ రాహుల్ వ్యతిరేకిస్తున్నారు
- దేశాన్ని అప్రతిష్టపాలు చేసేందుకే ఏఐ సదస్సు వద్ద కాంగ్రెస్ నిరసన
- ఏఐ సదస్సు వ్యక్తిగత రాజకీయాలు చేసుకునే ప్రదేశమా?

వివరాలు 4వ పేజీలో



## కాన్షీరామ్‌కు 'భారతరత్న' ఇవ్వండి

- ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ లేఖ
- భారత రాజకీయాల స్వరూపాన్నే కాన్షీరామ్ మార్చారని రాహుల్ కొనియాడారు
- తన ఉద్యమాల ద్వారా బహుజనుల్లో, పేదల్లో రాజకీయ చైతన్యం నింపారు

వివరాలు 4వ పేజీలో



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 170 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 197 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 286 (కిలో) |
| స్కిన్ లెస్ | 325 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹72

## రంజాన్ పండుగ మాత్రమే కాదు.. విలువలను గుర్తుచేసే పవిత్ర మాసం

'రంజాన్ కేవలం పండుగ కాదు...ఆత్మ శుద్ధి చేసుకునే సమయం. మనుషుల మధ్య సోదరభావం, మతాల మధ్య సామరస్యం తెలంగాణ సంస్కృతి. ఆ సంస్కృతిని అందరం కలిసి కాపాడుకోవాలి'అని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. .పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు



వివరాలు 3వ పేజీలో

## హైదరాబాద్ చుట్టూ రీజినల్ రింగ్ రైలు

- హైదరాబాద్ రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు డీపీఆర్ తయారీ సర్వేకు కేంద్రం ఆమోదం
- రీజినల్ రింగ్ రోడ్డుకు సమాంతరంగా రింగ్ రైలు మార్గం ఏర్పాటు ప్రతిపాదన
- గత ప్రతిపాదనలో ఉన్న 10–11 కిలోమీటర్ల దూర మార్గంపై మార్పులు పరిశీలన
- సర్వే అనంతరం డీపీఆర్ సిద్ధం చేసి నీతి ఆయోగ్, కేంద్ర ఆర్థిక శాఖలకు నివేదిక
- ప్రాజెక్టు అమలుతో ప్రయాణికులు, సరుకు రవాణాకు మెరుగైన సౌకర్యాలు

# నేటి నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు



- ఈ నెలాఖరు వరకు అసెంబ్లీ!
- ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రసంగం
- సమావేశాల నిర్వహణపై అధికారులు, కార్యదర్శులతో గుత్తా సుఖేందర్ రెడ్డి, గడ్డం ప్రసాద్ సమావేశం

**హైదరాబాద్, మార్చి 15:**

తెలంగాణ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 16న ఉదయం 11:45 గంటలకు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ప్రసంగిస్తారు. అనంతరం బీఏసీ సమావేశం నిర్వహిస్తారు. సభ ఎన్ని రోజులు నిర్వహించాలనే అంశంపై బీఏసీలో నిర్ణయం తీసుకుంటారు. ఈ నెల 20వ తేదీన శాసన సభలో, మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ నెలాఖరు వరకు బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం . బడ్జెట్ సమావేశాలు అత్యంత ముఖ్యమైనవని, ఎక్కువ రోజులు జరగడంతో పాటు ఎక్కువ సమయం పాటు జరుగుతాయని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌లు పేర్కొన్నారు. సభ లోపల, బయట కూడా ప్రశాంత వాతావరణం ఉంటేనే సమావేశాలు సాఫీగా జరుగుతాయని వారు స్పష్టం చేశారు. అనుకోని సంఘటనలు, అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రభుత్వానికి, శాసన సభకు మంచి పేరు తీసుకువచ్చేలా పని చేయాలని అధికారులకు, శాసనసభ, మండలి కార్యదర్శులకు సూచించారు. సమావేశాలు సజావుగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర మూడో శాసనసభ ఎనిమిదో సమావేశాలు, తెలంగాణ శాసన మండలి 26వ సమావేశాల నేపథ్యంలో నిర్వహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు శాఖ ఉన్నతాధికారులతో ఈరోజు శాసనసభ భవనంలోని కమిటీ హాల్ లో సన్నాహక సమావేశం నిర్వహించారు.

**ధర్నాలు, ఆందోళనలు జరగకుండా ..**

సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని శాసనసభ, మండలి కార్యదర్శులకు స్పీకర్ గడ్డం ప్రసాద్ సూచించారు. ఆయా శాఖలకు సంబంధించిన చర్చ జరుగుతున్నప్పుడు సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉంటూ మంత్రులకు, సభ్యులకు తగిన సమాచారం అందిస్తూ సహకరించాలని స్పష్టం చేశారు. శాసనసభ, శాసనమండలి సమావేశాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరగడానికి పోలీసు శాఖ తరపున చర్యలు తీసుకోవాలని సూచించారు. సభ జరుగుతున్న సమయంలో ధర్నాలు, ఆందోళనలు జరగకుండా ముందస్తుగానే సమాచారం అందుకుని, సమావేశాలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

తెలంగాణ పోలీసులకు మంచి పేరు ఉంది : ఈసారి శాసన మండలి, అసెంబ్లీ సమావేశాలు ఒకే ప్రదేశంలో జరుగుతున్నాయని, అందువల్ల అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. మండలి సమావేశాలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమష్టిగా పని చేయాలని, అవసరమైన నోడల్ అధికారులను, లైజనింగ్ ఆఫీసర్లను నియమించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ప్రశ్నలకు వెంటనే సమాధానాలు పంపించాలని తెలిపారు. తెలంగాణ పోలీస్ వ్యవస్థ దేశంలోనే సమర్థవంతమైనదని, మంచి పేరు ఉన్నదని కొనియాడారు. శాసన మండలి సమావేశాలు సజావుగా జరిగే విధంగా సహకరించాలని కోరారు.

**తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ..**

ఈ సమావేశాల్లో ధర్నాలకు ఎక్కువగా పిలుపునిచ్చే అవకాశాలు ఉన్నాయని, చలో అసెంబ్లీ కార్యక్రమాలు జరగకుండా చూడాలని, సమావేశాలకు హాజరయ్యే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మొదటి రోజు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శాసనసభ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ జరుగుతుందని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సభలు సజావుగా జరగడానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన పూర్తి సహాయ, సహకారాన్ని అందిస్తామని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. కో-ఆర్డినేషన్ కోసం ప్రతి శాఖ నుంచి ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తామన్నారు. ఈ సమావేశంలో శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిలు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా, ఫైనాన్స్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, స్పెషల్ ఫైనాన్స్ సెక్రటరీ సిక్తా పట్నాయక్, డీజీపీ శివధర్ రెడ్డి, ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.



# మాజీ ఎమ్మెల్యే ఫాంహౌజ్‌లో డ్రగ్స్ పార్టీ కలకలం

- ఎంపీ సహా ఆరుగురికి పాజిటివ్
- పార్టీ చేసుకుంటున్నట్లు సమాచారంతో సోదాలకు వెళ్లిన ఈగల్ టీమ్
- ఈగల్ టీమ్‌ను అడ్డుకుని ఢిల్లీ రియల్ ఎస్టేట్ వ్యాపారి కాల్పులు
- ఆరుగురికి పాజిటివ్ వచ్చిందన్న ఈగల్ ఎస్పీ గిరిధర్

**హైదరాబాద్, మార్చి 15:**

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఫాంహౌజ్‌లో డ్రగ్స్ పార్టీ కలకలం రేపింది. పార్టీలో పాల్గొన్న 11 మందిలో ఆరుగురికి డ్రగ్స్ పాజిటివ్‌గా తేలింది. వారిలో తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డితో పాటు ఏపీలోని ఏలూరు ఎంపీ మహేశ్ కుమార్ యాదవ్ కూడా ఉండటం చర్చనీయాంశమైంది. శనివారం రాత్రి పోలీసులు సోదాలకు వెళ్లిన సమయంలో 11 మందిలో ఒకరు తుపాకీతో గాల్లోకి కాల్పులు జరపడం విస్మయానికి గురి చేసింది.

నగర శివారు మొయినాబాద్‌లో ఈగల్ బృందం చేసిన దాడుల్లో ప్రజా ప్రతినిధులు ఏర్పాటు చేసుకున్న ఓ డ్రగ్స్ పార్టీ భగ్నం అయ్యింది. అజీజ్‌నగర్‌లో తాండూర్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డికి చెందిన ఫాంహౌజ్ ఉంది. అందులో శనివారం సాయంత్రం నుంచి ఆయన పార్టీ ఏర్పాటు చేశారు. ఈ పార్టీలో పైలెట్ రోహిత్ రెడ్డి, ఆయన సోదరుడు రితేశ్ రెడ్డి, ఏపీలోని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్, ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్త నమిత్ శర్మ, హైదరాబాద్ పుప్పాలగూడకు చెందిన మొరవినేని రమేశ్, మణికొండకు చెందిన ప్రైవేట్ ఉద్యోగి వరమచనేని శ్రవణ్ కుమార్, నానక్‌రామ్‌గూడకు చెందిన వ్యాపారవేత్త నల్లపనేని విజయకృష్ణ, పుప్పాలగూడకు చెందిన వ్యాపారవేత్త తిరువీధుల అర్జున్ రెడ్డి, వికారాబాద్‌కు చెందిన సిలివెరి శరత్‌కుమార్, బెంగళూరుకు చెందిన న్యాయవాది కౌశిక్ రవి, ఫిల్మ్‌నగర్‌కు చెందిన గృహిణి ప్రియాంక రెడ్డి ఉన్నారు.

**లైసెన్స్‌డ్ రివాల్వర్‌తో కాల్పులు :**

ఈ 11 మంది కలిసి పార్టీ చేసుకుంటుండగా పార్టీలో డ్రగ్స్ వినియోగిస్తున్నారని ఈగల్ పోలీసులకు సమాచారం అందింది. దాంతో పోలీసులు ఫాంహౌజ్‌ను చుట్టుముట్టారు. ఇదే సమయంలో పైలెట్ రోహిత్‌రెడ్డి తమ్ముడు రితేశ్ రెడ్డికి చెందిన లైసెన్స్‌డ్ రివాల్వర్‌తో ఢిల్లీకి చెందిన నమిత్ శర్మ గాల్లోకి కాల్పులు జరిపాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనా స్థలంలో 2 గ్రాముల కొకైన్, రివాల్వర్, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వారందరికీ డ్రగ్స్ ర్యాపిడ్ టెస్ట్ చేయగా, ఐదుగురికి పాజిటివ్ వచ్చింది. వారిలో పైలెట్ రోహిత్ రెడ్డి, రితేశ్ రెడ్డి, అర్జున్ రెడ్డి, కౌశిక్ రవి, నమిత్ శర్మ ఉన్నారు. బ్లడ్ శాంపిల్స్‌ను కూడా పరీక్షలకు పంపించగా, ఇవాళ ఉదయం ఎంపీ మహేశ్ కుమార్‌కు కూడా పాజిటివ్‌గా తేలింది. దీంతో డ్రగ్స్ పాజిటివ్ వచ్చిన వారి సంఖ్య ఆరుకు చేరింది. మిగిలిన ఐదుగురికి నెగటివ్ వచ్చిందని పోలీసులు తెలిపారు.

**వేరే ప్రాంతాల్లో డ్రగ్స్ తీసుకున్నాం :**

ఈ 11 మందిపై మొయినాబాద్ పోలీసులు ఎన్డీపీఎస్ చట్టం, ఆర్మ్స్ యాక్ట్, ఎక్సైజ్ చట్టం, అక్రమ కార్యకలాపాల వంటి అంశాలకు సంబంధించిన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. 11 మందిని రహస్య ప్రాంతానికి తరలించి విచారించారు. అయితే డ్రగ్స్ పాజిటివ్ వచ్చిన ఆరుగురూ తాము ఫాంహౌజ్‌లో డ్రగ్స్ తీసుకోలేదని, వేరే ప్రాంతాల్లో ఇదివరకే తీసుకున్నామని చెప్పినట్లు సమాచారం. అందులో వాస్తవమెంత అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలంలో రెండు గ్రాముల డ్రగ్స్ దొరగడంతో శనివారం రాత్రి కూడా డ్రగ్స్ తీసుకున్నట్లు అనుమానిస్తున్నారు.

**8 మందికి స్టేషన్ బెయిల్ :**

మొయినాబాద్ ఫాంహౌజ్ డ్రగ్స్ కేసులో 8 మందికి స్టేషన్ బెయిల్ వచ్చింది. ఏపీ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్, కౌశిక్ రవి, అర్జున్‌రెడ్డి, నల్లపనేని విజయకృష్ణ, శ్రవణ్‌కుమార్, రమేశ్, శరత్‌కుమార్, ప్రియాంకలకు స్టేషన్ బెయిల్ ఇచ్చారు. వీరికి నోటీసులిచ్చి విడుదల చేశారు. పైలెట్ రోహిత్‌రెడ్డి, ఆయన సోదరుడు రితేష్‌రెడ్డి, నమిత్ శర్మలను న్యాయమూర్తి వద్దకు తరలించారు.

**పక్కా సమాచారంతోనే దాడి**

"ఓ నలుగురు ఐదుగురు కలిసి డ్రగ్స్ తీసుకుంటున్నారనే సమాచారం అందింది. దీంతో ఆ ఫామ్ హౌజ్‌పై రైడ్ చేశాం. అక్కడ గన్ ఫైరింగ్ శబ్దం వినిపించడంతో మా టీమ్ అప్రమత్తమై వారి నుంచి గన్ తీసుకున్నాం. ఆ వ్యక్తిని కస్టడీలోనికి తీసుకున్నాం. అతడు ఆకాశం వైపుగా కాల్పులు జరిపాడు. 11 మందిని కస్టడీలోనికి తీసుకున్నాం. వారికి డ్రగ్ టెస్టు చేయగా మొదట ఐదుగురికి పాజిటివ్ వచ్చింది. మరో ఆరుగురికి నెగిటివ్ వచ్చింది. అక్కడున్న వారందరికీ రెండు దశల్లో టెస్టులు జరిగాయి. రెండో దశలో ఐదుగురితో పాటు మరో వ్యక్తికి పాజిటివ్‌గా తేలింది."

- గిరిధర్‌రావు, ఈగల్‌ఫోర్స్ ఎస్పీ

# మిస్టర్ రంగనాథ్.. జాగ్రత్త

**నీ పై దిఫమేషన్ కేసు వేస్తా.. కోర్టుకు లాగుతా'**
**హైడ్రా కమిషనర్‌కు కవిత వార్నింగ్**



**హైదరాబాద్, మార్చి 15:**

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు కల్వకుంట్ల కవిత వార్నింగ్ ఇచ్చారు. మిస్టర్ రంగనాథ్ మిమ్మల్ని కోర్టుకు ఈడ్చుకుని వెళ్తా జాగ్రత్త అంటూ వార్నింగ్ ఇచ్చారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో వీడియోలు పోస్టు చేశారని ఆరోపిస్తూ, వెంటనే వాటిని తొలగించకపోతే డిఫమేషన్ కేసు వేస్తానని ఆమె హెచ్చరించారు. ఆదిత్య రియల్టర్స్ నిర్మాణాల విషయంలో గతంలోనే హైడ్రా అధికారులు ఆక్రమణలు జరిగినట్లు లేఖలు రాశారని కవిత తెలిపారు. అదే అంశంపై తాము ధర్నా చేస్తే ఇప్పుడు తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. హైడ్రా అధికారిక ఎక్స్ ఖాతాలో వాయిస్ ఓవర్‌తో వీడియోలు పోస్టు చేయడం సరైన పద్ధతి కాదని ఆమె మండి పడ్డారు. మార్చి 3వ తేదీన నిర్వహించిన తమ నిరసనకు ఆరు నెలల ముందే సంబంధిత నిర్మాణంలో ఆక్రమణలు ఉన్నట్లు అధికారులు గుర్తించారని కవిత వివరించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. పేదల ఇళ్లను మాత్రమే కూల్చుతూ పెద్దల నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు చేశారు.

మూసీ నది పరివాహక ప్రాంతంలో నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంపై కూడా కవిత ప్రశ్నించారు. గత ప్రభుత్వ కాలంలో రివర్‌బెడ్‌లో నిర్మాణాలకు అనుమతి ఇవ్వలేదని, ఇప్పుడు ఎందుకు ఇస్తున్నారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్ట్ పేరుతో రాష్ట్రాన్ని ప్రపంచ బ్యాంక్ల వద్ద తాకట్టు పెడుతున్నారని గతంలోనే తాము హెచ్చరించామని చెప్పారు. ప్రాజెక్ట్‌కు సంబంధించి పూర్తి డీపీఆర్ ఇప్పటికీ లేదన్నారు. ప్రజలకు స్పష్టమైన ప్రయోజనాలు ఏమిటో ప్రభుత్వం వెల్లడించడం లేదని కవిత విమర్శించారు. ప్రాజెక్ట్ ఖర్చు కూడా ఆరు నెలల్లోనే భారీగా పెరిగిందన్నారు.

మూసీ అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లు కూల్చడం సరైంది కాదని, బాధితులతో చర్చించి వారికి న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేశారు. వెలుగుమట్ల బాధితుల సమస్యపై ఈ నెల 17న ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తెలంగాణ జాగృతి పోరాటం కొనసాగిస్తుందని కవిత స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే హైడ్రా ఎక్స్‌లో పెట్టిన వీడియోలను ఈ రోజు సాయంత్రం వరకు తొలగించకపోతే కోర్టులో కేసు వేస్తానని కవిత మరోసారి హెచ్చరించారు. 'మిస్టర్ రంగనాథ్. నీ పై దిఫమేషన్ కేసు వేస్తా.. నిన్ను కోర్టుకు లాగుతా.' అంటూ కవిత తీవ్రస్థాయిలో సవాల్ విసిరారు.

# అసెంబ్లీలో ఎమ్మెల్యేలందరికీ డ్రగ్ టెస్ట్

**కేటీఆర్ డ్రగ్ టెస్టుకు సిద్ధం కావాలి: పీసీసీ చీఫ్ మహేశ కుమార్ గౌడ్**
**అవసరమైతే అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలందరికీ డ్రగ్ పరీక్షలు నిర్వహిద్దామని సవాల్**
**మొయినాబాద్ ఫామ్ హౌస్ ఘటనతో డ్రగ్స్ వ్యవహారం మళ్లీ చర్చనీయాంశం**



**హైదరాబాద్, మార్చి 15:**

మొయినాబాద్ డ్రగ్స్ కేసు రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేపుతోంది. తాజాగా పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ కేసుపై మాజీ మంత్రి కేటీఆర్ టీమ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కావాలంటే ఎమ్మెల్యేందరికీ డ్రగ్ టెస్ట్ చేస్తామన్నారు. " రాష్ట్రంలో ఈగల్ టీమ్ డ్రగ్స్ రహిత సమాజం కోసం దాడులు చేస్తోంది. కేటీఆర్, ఆయన అనుచరులు డ్రగ్స్ తీసుకున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డగ్స్ టెస్టుకు కేటీఆర్ రెడీగా ఉండాలి. కావాలంటే అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలందరం పరీక్షలు చేయించుకుందాం. సీఎం రేవంత్ .. డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం కృషి చేస్తున్నారని" మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు.

మరోవైపు గాంధీభవన్ వద్ద కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆధ్వర్యంలో కార్యకర్తలు, నేతలు ఆందోళన చేపట్టారు. నో డ్రగ్స్, సేవ్ తెలంగాణ అంటూ నినాదాలు చేశారు. ఈ క్రమలోనే కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డిపై వెంకట్ సంచలన ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ పాలనలో పదేళ్లుగా కేటీఆర్ సన్నిహితులు డ్రగ్స్ వాడారని విమర్శించారు. డ్రగ్స్ అంశంపై మాట్లాడకుండా దీన్ని పక్కదారి పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇదిలాఉండగా మార్చి 14న రాత్రి మొయినాబాద్‌లోని పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో తెలంగాణ పోలీసుల ఈగల్ టీమ్ దాడులు చేసింది. ఈ దాడుల్లో 2 గ్రాముల కొకైన్, ఇతర మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. సోదాలు జరిపిన సమయంలో ఓ వ్యక్తి గాల్లో కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. ఢల్లీకి చెందిన రితేష్ రెడ్డి అనే వ్యాపారి తుపాకితో కాల్పులు జరిపినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ ఘటనలో పైలట్ రోహిత్ రెడ్డితో పాటు ఏపీకి చెందిన ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, ఇతర రాష్ట్రాలకు చెందిని పలువురు నేతలు, వ్యాపారవేత్తలో పాటు మొత్తం 10 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే ప్రాథమిక పరీక్షల్లో రోహిత్ రెడ్డితో సహా అయిగురికి డ్రగ్స్ పాజిటివ్ వచ్చినట్లు తెలుస్తోంది. తుది నిర్ధారణ కోసం రక్తం, మూత్ర నమూనాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు.



# రంజాన్ పండుగ మాత్రమే కాదు.. విలువలను గుర్తుచేసే పవిత్ర మాసం



**హైదరాబాద్, మార్చి 15:**

'రంజాన్ కేవలం పండుగ కాదు...ఆత్మ శుద్ధి చేసుకునే సమయం. మనుషుల మధ్య సోదరభావం, మతాల మధ్య సామరస్యం తెలంగాణ సంస్కృతి. ఆ సంస్కృతిని అందరం కలిసి కాపాడుకోవాలి'అని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. 'ముస్లింల సంక్షేమం పట్ల మాకు చిత్తశుద్ధి ఉంది. అజరుద్దీన్ కు మంత్రి పదవి ఇచ్చాం. సీనియర్ నేత షబీర్ అలీ కి సలహాదారు పదవి ఇచ్చాం. ఎనిమిది కార్పొరేషన్లకు మైనారిటీ నేతలను ఛైర్మన్లు చేశాం. క్రికెటర్ సిరాజ్ కు డీఎస్పీ ఉదోగ్యం ఇచ్చాం. బాక్సర్ నిక్కత్ జరీన్ కు రెండు కోట్ల రూపాయలు ఇచ్చి ప్రోత్సహించాం'అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ ప్రభుత్వం మీది , నేను అందరివాడిని... మీ సోదరుడిని. ప్రతి ఒక్కరి సహకారంతో ఈ ప్రభుత్వం నడుస్తోంది. మతాల మధ్య చిచ్చు పెట్టడానికి కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు. అన్ని మతాలు ఐక్యంగా ఉండటమే తెలంగాణకు శ్రీరామరక్ష. అందరి తోడ్పాటుతో దేశం లో తెలంగాణను అభివృద్ధి లో ముందు వరుసన నిలబెడతాం'అని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

**రంజాన్ మాసం ఒక పండుగ మాత్రమే కాదు**

'అన్ని మతాలకు చెందినవారు కలిసికట్టుగా సోదరభావంతో ఈ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపించుకుందామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రంజాన్ ఇఫ్తార్ విందు సందర్భంగా పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మైనారిటీల అభ్యున్నతికి సాధ్యమైనంత మేరకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.'రంజాన్ మాసం ఒక పండుగ మాత్రమే కాదు. విలువలను గుర్తుచేసే పవిత్ర మాసం. నెల రోజులపాటు ఆత్మశుద్ధితో పరులకు సహకారం అందిస్తూ అందరితో సత్సంబంధాలను కొనసాగించడమే రంజాన్ మాసం పవిత్రత'అని సీఎం రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో వెల్లడించారు.

**మైనారిటీల సంక్షేమం కోసం కట్టుబడి ఉన్నాం**

'రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమం కోసం ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుంది. క్రికెటర్ మహమ్మద్ అజారుద్దీన్ కి మంత్రి పదవి, షబ్బీర్ అలీకి సలహాదా రుగా, క్రికెటర్ మహమ్మద్ సిరాజ్ కు, బాక్సింగ్ చాంపియన్ నిఖత్ జరీన్ కు డీఎస్పీగా ఉద్యోగ కల్పించడమే కాకుండా 2 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందించాం'అని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు.'8 మంది మైనారిటీ నాయకులను వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లుగా నియమించాం'అని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఈ రంజాన్ పండుగ ప్రజల్లో సఖ్యత, సోదరభావం తీసుకొచ్చి హిందువులు, ముస్లింలు, సిక్కులు, క్రిస్టియన్లు అందరూ మత సామరస్యంతో రాష్ట్ర అభివృద్ధి ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. ప్రతి సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో మైనారిటీలకు సింహ భాగమిచ్చి ముందుకు నడిపిస్తున్నామని, ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లలో మైనారిటీలకు అవకాశం కల్పిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

**ఈ ప్రభుత్వం మనందరిదీ**

'ఈ ప్రభుత్వం మనందరిదీ. నేను మీ సోదరుడిని. మనమందరం కలిసి తెలంగాణ, హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేసుకుందాం. అందరం కలిసి కష్టపడితేనే ఈ రాష్ట్రం, దేశం ప్రగతి పథంలో ముందుకు సాగుతాయి. ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో మీ అందరి సహకారం కావాలి'అని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.'ఈ ఇఫ్తార్ విందులో మంత్రులు మహమ్మద్ అజారుద్దీన్ , పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పొన్నం ప్రభాకర్ , ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, లోక్ సభ సభ్యుడు అసదుద్దీన్ ఓవైసీతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ముస్లిం మతపెద్దలు, మైనారిటీ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అంజనాపురంలో ఏప్రిల్‌కు
# 'పామ్' ఫ్యాక్టరీ పూర్తి



- సీడ్ గార్డెనింగ్, ఆయిల్‌పామ్ పరిశోధనాభివృద్ధి కేంద్రం కూడా
- సీఎంచే 22న నర్మెట్టలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం: తుమ్మల

**ఖమ్మం మార్చి 15 :**

ఏప్రిల్ నెలాఖరుకల్లా ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని రైతులకు అందుబాటులోకి తెస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అంజనాపురంలో ప్రముఖ కార్పొరేట్ సంస్థ గోద్రేజ్ నిర్మిస్తున్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఫ్యాక్టరీలో ఆయిల్ పామ్ పరిశోధన, అభివృద్ధి కేంద్రం, సీడ్ గార్డెనింగ్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సీడ్ గార్డెనింగ్ ఏర్పాటుకు అవసరమైన స్థలం కేటాయింపునకు రైతులను ఒప్పించాలని అధికారులకు సూచించారు. సిద్దిపేట జిల్లా నర్మెట్టలో ఈ నెల 22న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు.

# హైదరాబాద్ చుట్టూ రీజినల్ రింగ్ రైలు




- హైదరాబాద్ రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు డీపీఆర్ తయారీ సర్వేకు కేంద్రం ఆమోదం
- రీజినల్ రింగ్ రోడ్డుకు సమాంతరంగా రింగ్ రైలు మార్గం ఏర్పాటు ప్రతిపాదన
- గత ప్రతిపాదనలో ఉన్న 10–11 కిలోమీటర్ల దూర మార్గంపై మార్పులు పరిశీలన
- సర్వే అనంతరం డీపీఆర్ సిద్ధం చేసి నీతి ఆయోగ్, కేంద్ర ఆర్థిక శాఖలకు నివేదిక
- ప్రాజెక్టు అమలుతో ప్రయాణికులు, సరుకు రవాణాకు మెరుగైన సౌకర్యాలు

**హైదరాబాద్, మార్చి15:**

హైదరాబాద్ రీజినల్ లరింగ్ రైలు ప్రాజెక్టుకు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ ప్రాజెక్టు డీపీఆర్ తయారు చేసేందుకు కావాల్సిన సర్వే చేసేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక ఈ రింగ్ రైలును ఓఆర్ఆర్‌కు సమాంతరంగా ఉండేలా చూడాలని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి కేంద్రాన్ని కోరారు. అన్ని అనుమతులు పూర్తైన తర్వాత ప్రాజెక్టు పనులు ప్రారంభం కానున్నాయి. ఈ ఆర్ఆర్ఆర్ అందుబాటులోకి వస్తే ప్రయాణికులతో పాటు సరుకు రవాణాకు కూడా మేలు జరగనుంది.

తెలంగాణకు అతి ముఖ్యమైన హైదరాబాద్ రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టులో కీలక ముందడుగు పడింది. ఈ ప్రతిష్టాత్మక రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్ట్ డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) తయారు చేసేందుకు చేపట్టాల్సిన సర్వేను నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి.. లోక్‌సభలో అడిగిన ప్రశ్నలకు సమాధానంగా కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్.. ఈ ప్రాజెక్టుకు సంబంధించి లేఖ రాశారు. అయితే ఈ రీజినల్ రింగ్ రైలుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం సూచించిన మార్పులకు అనుగుణంగా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడానికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం విశేషం.

రీజినల్ రింగ్ రోడ్డుకు సుమారు 10 కిలోమీటర్ల నుంచి 11 కిలోమీటర్ల దూరంలో గతంలో రీజినల్ రింగ్ రైలు మార్గాన్ని ప్రతిపాదించారు. అయితే దీనివల్ల రీజినల్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రైలు రెండు మార్గాలు వేర్వేరుగా ఉండటం వల్ల.. ఈ రెండు ప్రాజెక్టుల కోసం భూసేకరణ చేపట్టడం తలకు మించిన భారంగా మారుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావించారు. ఇలా వేరుగా చేపట్టడం వల్ల పరిపాలనపరంగా ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయని ముందే పసిగట్టారు. ఈ నేపథ్యంలోనే రీజినల్ రింగ్ రోడ్డుకు సమాంతరం రీజినల్ రింగ్ రైలు మార్గాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం.. ప్రస్తుతం ఏర్పాటు కానున్న రీజినల్ రింగ్ రోడ్డు వెంటే రైల్వే అలైన్‌మెంట్‌ను ఖరారు చేసే అంశంపై రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సంప్రదింపులు చేస్తోంది.

అయితే ఈ రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు అమలుకు సంబంధించి కచ్చితమైన కాలపరిమితిని ఇప్పుడే చెప్పలేమని కేంద్రమంత్రి రవనీత్ సింగ్ వెల్లడించారు. కానీ డీపీఆర్ రెడీ చేసేందుకు కావాల్సిన ప్రాథమిక సర్వేకు ఆమోదం తెలపడం వల్ల ఈ ప్రాజెక్టులో కీలక అడుగు పడినట్లయింది. సర్వే పూర్తి చేసి పూర్తిస్థాయి రిపోర్టు రెడీ అయిన తర్వాత దాన్ని నీతి ఆయోగ్, కేంద్ర ఆర్థిక శాఖల ఆమోదానికి తెలంగాణ ప్రభుత్వం పంపించనుంది. అన్ని శాఖల నుంచి అనుమతులు వచ్చిన తర్వాత ఈ మెగా ప్రాజెక్టును పట్టాలెక్కించనున్నారు.

ఈ రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టును తెలంగాణ సర్కార్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. దీనివల్ల హైదరాబాద్ నగరం చుట్టూ రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే కాకుండా.. నగర శివారు ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయడానికి ఎంతో ఉపయోగపడుతుందని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గతంలో కేంద్రమంత్రులను వ్యక్తిగతంగా కలిసిన సమయంలో.. ఈ రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టుకు ఉన్న ప్రాధాన్యతను రేవంత్ రెడ్డి వారికి వివరించారు. పక్కపక్కనే రైలు, రోడ్డు మార్గాలు ఉండటం వల్ల రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా భూసేకరణకు కూడా సమస్యలు తలెత్తే అవకాశాలు తక్కువగా ఉంటాయని రాష్ట్ర సర్కార్ భావిస్తోంది. ఈ రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు పూర్తి అయి.. అందుబాటులోకి వస్తే హైదరాబాద్ పొరుగున ఉన్న జిల్లాలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడనుంది. కేవలం ప్రయాణికులకు మాత్రమే కాకుండా సరుకు రవాణాకు కూడా ఎంతో మేలు చేయనుంది. సమన్వయంతో రింగ్ రోడ్డు, రింగ్ రైలు ప్రాజెక్టులను పూర్తి చేస్తే.. ఆయా ప్రాంతాల్లో పారిశ్రామిక హబ్‌లు ఏర్పడే అవకాశం ఉంది. డీపీఆర్ సర్వేకు కేంద్రం ఆమోదం తెలపడంతో ప్రాజెక్టు పనులు వేగవంతం కానున్నాయి.

# రాష్ట్రంలో మళ్లీ వర్షా లు...

- వాతావరణ శాఖ అలర్ట్
- ఐదు రోజులు కురిసే అవకాశం
- వెల్లడించిన వాతావరణ శాఖ

**హైదరాబాద్, మార్చి 15 :**

మార్చి ఆరంభంలోనే ఎండలతో అల్లాడిపోయిన ప్రజలకు వాతావరణ శాఖ ఉపశమనం కలిగించే అలర్ట్ ఇచ్చింది. రాబోయే ఐదు రోజుల పాటు రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో సుమారు 40 నుంచి -50 మి.మీ మేర భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో వీచే బలమైన గాలులు, భీకరమైన ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉత్తర, పశ్చిమ జిల్లాల్లో 30 నుంచి 40 కిలోమీటర్లు వేగంతో ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించింది. ద్రోణి ప్రభావం ఆగ్నేయ, తూర్పు దిశల నుంచి వీస్తున్న తేమ గాలులతో వర్షాలు కురిసే అవకాశాముందని తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై చల్లని గాలులు వీస్తుందని, దీంతో మండే ఎండలతో సతమతమవుతున్న జనాలకు కొంత మేర ఉపశమనం లభించనుందని వివరించింది. ఈదురు గాలులు బలంగా వీచే అవకాశం ఉందని రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ కేంద్రం సూచించింది. ఈ క్రమంలో సోమవారం రాష్ట్రంలో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్క వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

# ఘోర రోడ్డు ప్రమాదం

## ఆటోను ఢీ కొట్టిన లారీ... నలుగురు దుర్మరణం

**నల్గొండ, మార్చి 15:**

నల్గొండ జిల్లా చింతపల్లి మండలం దేవరపల్లి గేట్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.చెన్నారం గేటు వద్ద ఆగి ఉన్న ఆటోను లారీ ఢీ కొట్టింది.ఈ ప్రమాదంలో స్పాట్‌లోనే ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తుండగా మరో ఇద్దరు మార్గమధ్యలో మృతి చెందారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని మెరుగైన చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. అలాగే మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

**మృతుల్లో ఇద్దరు బిహారీలు**

నల్గొండ జిల్లా నాంపల్లి మండలం దేవత్‌పల్లి చెన్నారం గేటు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.ఆగి ఉన్న ఆటోను వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టింది.ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందగా...మరో ఇద్దరు మార్గమధ్యలో మృతి చెందారు. మృతి చెందిన వారిలో ఇద్దరు బీహార్‌కు చెందిన వారు ఉన్నట్లు పోలీసులు గుర్తిచారు. మరో ఇద్దరు బొత్య తండకు చెందిన వారీగా గుర్తించారు.మరో ఏడుగురికి గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే ప్రమాద సమయంలో లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు చెప్తున్నారు.

# అప్పుడు పట్టిచ్చారు..... ఇప్పుడు పట్టుబడ్డారు

- మొయినాబాద్ డ్రగ్స్ కేసులో ముగ్గురునిందితులకు 14 రోజుల రిమాండ్
- పోలీసులపై కాల్పులు జరపడాన్ని తీవ్రంగా పరిగణించిన జడ్జి

**మొయినాబాద్,మార్చి 15:**

: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్ పా ర్టీ కేసులో ముగ్గురు నిందితులకు కోర్టు 14రోజుల రిమాం డ్ విధించింది. ఆదివారం రాత్రి ఉప్పర్‌పల్లి మెజిస్ట్రేట్ ఎదు ట పోలీసులు ఈ కేసులో నిందితులుగా ఉన్న మాజీ ఎంఎల్ఎ పైలట్ రోహిత్‌రెడ్డి, రితేశ్‌రెడ్డి, మరో నిందితుడు నమిత్ శర్మలకు 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం వీరిని పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. అంతకుముందు ఈ కేసులో 11 మందిని అదుపులోకి తీసుకున్న ఈగల్ పోలీసులు అందరికీ డ్రగ్స్ పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఏలూరు ఎంపి పుట్టా మహేశ్ యాదవ్, పైలట్ రోహిత్‌రెడ్డి సహా ఆరుగురికి పాజిటివ్ వచ్చింది. అయితే టిడిపి ఎంపి పుట్టా మహేష్ కుమార్, కౌశిక్ రవి, అర్జున్ రెడ్డి, రమేష్, విజయ్ కృష్ణ, శ్రవణ్ కుమార్, శరత్ కుమార్, ప్రియాంక లకు స్టేషన్ బెయిల్ లభించింది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను ఆదివారం ఈగిల్ అధికారులు ఓ ప్రకటనలో వె ల్లడించారు. ఫాం హౌస్‌లో మాదకద్రవ్యాలు, సైకోట్రోపిక్ పదార్థాలతో పాటు పెద్ద మొత్తంలో మద్యంతో పార్టీని జరుపుకుంటున్నట్లు అధికారులకు సమాచారం అందండంతో పోలీసు బృందం ఫామ్‌హౌస్ ఆవరణను చుట్టుముట్టామని, ఒక మహిళతో సహా 11 మంది వ్యక్తులు మద్యం, మాదకద్రవ్యాలు, సైకోట్రోపిక్ పదార్థాలను సేవిస్తున్నట్లు గుర్తించామన్నారు. పార్టీలో అదుపులోకి తీసుకున్న 11 మందిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ముగ్గురు నిందితులను పోలీసులు ఉప్పర్ పల్లిలోని జడ్జి నివాసంతో ఆయన ఎదుట హాజరు పరిచ్చారు. వారికి బెయిల్ ఇవ్వాలని నిందితుల తరుపు న్యాయవాదులు వాదించారు. అయితే ప్రధానంగా గన్ ఫైరింగ్ గురించి పోలీసులు దృష్టి సారించడంతో ప్రభుత్వ న్యాయవాదులు సైతం ఆ దిశగానే వాదనలు వినిపించారు. కాగా, నిందితుల్లో మాజీ ఎంఎల్ఏ రోహిత్ రెడ్డి, టిడిపి ఎంపి మహేష్ కుమార్, నమిత్ శర్మ, పంజుగుల రితేష్ రెడ్డి, కౌషిక్ రవి, తిరువీదుల అర్జున్ రెడ్డిలకు పాజిటివ్ వచ్చినట్లు అధికారులు తెలిపారు. అయితే ఫాం హౌస్‌లోనే నిందితులకు యూరిన్ పరీక్షలు నిర్వహించగా, ఎంపి మహేష్ కుమార్‌కు మాత్రం నెగెటివ్ వచ్చింది. యూరిన్ పరీక్షల(ర్యాపిడ్ టెస్ట్) సమయంలో మహేష్ కుమార్‌కు నెగెటివ్ వచ్చిందని, తరువాత రక్త పరీక్షలు నిర్వహించడంతో ఆయనకు కూడా పాజిటివ్ వచ్చినట్లు పోలీసులు వెల్లడించారు.

**దర్యాప్తు జరుగుతోంది : ఈగిల్ ఎస్పీ గిరిధర్**

ఈగిల్ ఎస్పీ గిరిధర్ రంగారెడ్డి ఈగిల్ కార్యాలయంలో మీడియాతో మాట్లాతూ మొయినాబాద్ ఫామ్‌హౌస్ డ్ర గ్స్ కేసులో పోలీసుల దర్యాప్తు జరుగుతోందన్నారు. డ్ర గ్స్ తీసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా చేయాలన్నదే ఈగల్ టీమ్ లక్ష్యమని, ఆ విధంగా పనిచేస్తున్నామని తెలియజేశారు. పోలీసులు లోపలికి వెళుతున్న క్రమంలో తుపాకీ కాల్పులు జరిగాయని, పోలీస్‌లు కాల్పులు ఆపాలని హెచ్చరించడంతో కాల్పులు ఆగిపోయాయని తెలిపారు. ఈ క్రమంలో అక్క డే ఒక వ్యక్తి చేతిలో రివాల్వర్ పట్టుకుని ఉండటం కనిపించిందని, వెంటనే ఆయుధంతో పాటు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని, మరొక వ్యక్తి చేతిలో ఖాళీ కార్ట్రిడ్జ్ కేసులు పట్టుకుని ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. ప్రాథమిక దర్యాప్తులో తుపాకి పట్టుకున్న వ్యక్తి నమిత్ శర్మ, ఖాళీ కార్ట్రిడ్జ్ కేసులు పట్టుకున్న వ్యక్తి సిల్వేరి శరత్ కు మార్‌గా గుర్తించినట్లు వెల్లడించారు. వారి నుండి పా యింట్ 32 క్యాలిబర్ రివాల్వర్ (జర్మనీలో తయారు చేయబడింది) తో పాటు, ఖాళీ కాట్రిడ్జ్‌లను స్వాధీనం చే సుకుని, ఫోరెన్సిక్ పరీక్ష నిమిత్తం తుపాకీ కాల్పుల అవశేషాల నమూనాలను కూడా సేకరించినట్లు చెప్పారు. సోదాల సమయంలో, నిందితుడు సిల్వరి శరత్ కుమార్ నుండి 0.26 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మాదకద్రవ్యాన్ని కౌశిక్ రవి ద్వారా సేకరించినట్లు అతను అంగీకరించినట్లు చెప్పారు. ఫామ్‌హౌస్ నుంచి భారీ మొత్తంలో మద్యం స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. డ్రగ్స్ వినియోగం గుర్తిస్తే టోల్ ఫ్రీ 1908 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యం ఉంచుతామని తెలిపారు.

# మోగిన నగారా

దేశంలో మళ్లీ ఎన్నికల హడావుడి మొదలుకానుంది. బంగాల్, కేరళ, తమిళనాడు, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల తేదీలను భారత ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషీలు ఆదివారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి షెడ్యూల్ అనౌన్స్ చేశారు. తమిళనాడు (234), పశ్చిమ బెంగాల్ (294), కేరళ (140), అస్సాం (126)తోపాటు పుదుచ్చేరి (30) రాష్ట్రాల్లో మొత్తంగా 824 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

అసోం: ఏప్రిల్ 9న పోలింగ్, కౌంటింగ్ మే 4న ఉంటుంది.

కేరళ: పోలింగ్ ఏప్రిల్ 9, కౌంటింగ్ మే4న.

తమిళనాడు: పోలింగ్ ఏప్రిల్ 23, కౌంటింగ్ మే 4న.

బంగాల్: పోలింగ్ ఏప్రిల్ 23, 29 తేదీల్లో ఉంటుంది. కౌంటింగ్ మే 4.

పుదుచ్చేరి: పోలింగ్ ఏప్రిల్ 9 , కౌంటింగ్ మే 4న.

పుదుచ్చేరితోపాటు నాలుగు రాష్ట్రాల శాసనసభల పదవీకాలం మే, జూన్‌లలో వేర్వేరు తేదీల్లో ముగియనుంది. ఈ రాష్ట్రాల్లో ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ూ×=) ప్రక్రియను పూర్తి చేసిన ఎన్నికల సంఘం. క్షేత్ర స్థాయి పరిస్థితులను పర్యవేక్షించేందుకు ఆయా రాష్ట్రాల్లోనూ ఇటీవల పర్యటించింది. "ఎన్నికలు జరిగే రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతంలో పర్యటించాం. ఎన్నికల షెడ్యూల్‌కు ముందు పార్టీల నేతల సలహాలు స్వీకరించాం. జిల్లా ఎలక్టోరల్ అధికారులు, ఎస్పీలు, ఐజీలు, డీఐజీలతోనూ భేటీ జరిగింది. చీఫ్ ఎలక్టోరల్ అధికారులు, సీఎస్‌లు,



డీజీపీలు, నోడల్ అధికారులతోనూ భేటీ జరిగింది. ఎస్ఐఆర్‌కు సంబంధించి బీఎల్‌వోలకు మౌలిక సదుపాయాలు కల్పించాం. పారదర్శక, నిష్పాక్షికంగా ఎన్నికల కోసమే ఎస్ఐఆర్ నిర్వహిస్తున్నాం. ఓటరు అవగాహన కార్యక్రమాల అధికారులు, యువ ఓటర్లతో మాట్లాడాం" అని జ్ఞానేశ్? కుమార్? తెలిపారు.

నాలుగు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతంలో 17.4 కోట్ల మంది ఓటర్లు ఉన్నాని జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. పారదర్శక, నిష్పాక్షికంగా ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. యువత ముందుకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. భారత్‌లో ఎన్నికల నిర్వహణ అంటే ప్రజాస్వామ్య పండుగ అంటూ వ్యాఖ్యానించారు.

నాలుగు రాష్ట్రాలు, పుదుచ్చేరిలో ఇలా!

మొత్తం ఓటర్ల సంఖ్య - 17.4 కోట్లు

మొత్తం అసెంబ్లీ స్థానాలు 824

పోలింగ్ స్టేషన్లు - 2.19లక్షలు

ఎన్నికల అధికారులు - 25 లక్షలు

"ఐదు రాష్ట్రాల్లో మొత్తం 25 లక్షల మంది ఎన్నికల అధికారులు ఉన్నారు. 15 లక్షల మంది పోలింగ్ సిబ్బంది, 8.5 లక్షల మంది భద్రతా సిబ్బంది ఉన్నారు. మొత్తం 2.18 లక్షల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. పోలింగ్, ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నాం. దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. దివ్యాంగులు, వృద్ధులు ఇంటి వద్ద నుంచి ఓటు వేసేందుకు దరఖాస్తు చేయాలి. అభ్యర్థుల ఫొటోలు ఈవీఎంలపై ప్రదర్శించాలని సూచించాం. పోలింగ్ ఏజెంట్ల బూత్‌లు వంద మీటర్ల తర్వాత ఏర్పాటు చేయాలి. ఓటరు సేవల కోసం ఈసీఐనెట్ డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేశాం. అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ వందశాతం వెబ్‌కాస్టింగ్ ఉంటుంది" అని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు.

**బైపోల్స్**

ఆరు రాష్ట్రాల్లో 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు జరగనున్నాయి. గోవా, గుజరాత్, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల్లో ఒక్క నియోజకవర్గం చొప్పున ఉపఎన్నిక జరగనుంది. కర్ణాటక, మహారాష్ట్రలో రెండు నియోజకవర్గాల చొప్పున ఉపఎన్నికలు జరుగుతాయి. కర్ణాటక(2), గోవా(1), నాగాలాండ్(1), త్రిపుర(1)లో ఏప్రిల్ 9న ఎన్నికల పోలింగ్ జరగనుంది. మహారాష్ట్ర(2), గుజరాత్(1)లో ఏప్రిల్ 23న ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. మే 4న ఉపఎన్నికల ఫలితాలు వెలువడతాయి.

# రాహుల్ గాంధీ భారత్‌ను, ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తున్నారు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారతదేశాన్ని, దాని ప్రజాస్వామ్యాన్ని కించపరిచేలా వ్యవహరిస్తున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆరోపించారు. ఇటీవలె దిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సదస్సు వద్ద కాంగ్రెస్ యువజన విభాగం నేతలు చొక్కాలు లేకుండా నిరసనకు దిగిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అది వ్యక్తిగత రాజకీయాలు చేసుకునే ప్రదేశం కాదని హితవు పలికారు. విపక్షాలకు నిరసన తెలిపే హక్కు తప్పకుండా ఉంటుందని, కానీ ఏఐ సదస్సులాంటి చోట నిరసన తెలపడం సరికాదన్నారు. బీజేపీ, ప్రధానమంత్రి నరేంద్రమోదీలను వ్యతిరేకించే క్రమంలో, చివరకు భారతదేశాన్ని కూడా వ్యతిరేకించడాన్ని రాహుల్ గాంధీ మొదలుపెట్టారని అమిత్‌షా విమర్శించారు. ఆదివారం అసోంలోని గువహటిలో జరిగిన బహిరంగ సభ వేదికగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

**రాహుల్ క్షమాపణ చెప్పకపోగా, నిరసనకారులను పొగిడారు**

"భారతదేశాన్ని ఏఐ విభాగంలో బలోపేతం చేసే లక్ష్యంతో ఏఐ ఇంపాక్ట్ సదస్సును దిల్లీలో నిర్వహించాం. కానీ కాంగ్రెస్ నేతలు అక్కడికి వెళ్లిపోయి, అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. వాళ్లలాగే మేం కూడా రాజకీయాల్లో ఉన్నాం. గతంలో ప్రతిపక్షంగా పనిచేసిన అనుభవం సైతం మాకుంది. కానీ ఇలాంటి నిరసన కార్యక్రమాలను మేం నిర్వహించలేదు. ఏఐ సదస్సు అనేది వ్యక్తిగత రాజకీయాలు చేసుకునే ప్రదేశం కాదు. యావత్ ప్రపంచం భారతదేశ ఏఐ టెక్నాలజీని, ఆవిష్కరణలను చూడటానికి, పెట్టుబడులు పెట్టడానికి ఆ సదస్సుకు వచ్చింది. దేశానికి




ముఖ్యమైన ఆ సదస్సు దగ్గర కాంగ్రెస్ యువజన విభాగం నేతలు అర్ధనగ్నంగా నిరసన తెలిపినందుకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పకపోగా, ఆ నిరసనలో పాల్గొన్నవాళ్లను ధైర్యవంతులని పొగిడారు. దేశాన్ని అప్రతిష్టపాలు చేసేందుకే కాంగ్రెస్ ఆ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది.ఏ బాధ్యతాయుత రాజకీయ పార్టీ కూడా అలా వ్యవహరించదని నేను భావిస్తున్నాను" అని అమిత్‌షా పేర్కొన్నారు.

**సత్తా ఉంటే బీజేపీని ఢీకొనండి**

నిజంగా సత్తాయే ఉంటే నేరుగా ప్రజాక్షేత్రంలో బీజేపీని ఢీకొనాలని కాంగ్రెస్ పార్టీకి అమిత్‌షా సవాల్ విసిరారు. ఏఐ సదస్సు లాంటి అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాల వద్ద నిరసనలకు దిగుతూ భారతీయ యువతకు అవకాశాలను కాంగ్రెస్ తగ్గిస్తోందన్నారు. అనవసరమైన చోట్ల ప్రతాపాన్ని చూపిస్తున్న రాహుల్ గాంధీ, పార్లమెంటు నుంచి మాత్రం పారిపోతున్నారని కేంద్ర హోంమంత్రి విమర్శించారు. ఇలా చేస్తున్నందుకు భారత ప్రజలు రాహుల్‌ను క్షమించరన్నారు.

**ఆరోగ్య రంగంలో అసోం స్వయం సమృద్ధి**

"అసోంను ఆరోగ్య రంగంలో వికసిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు సీఎం హిమంత బిస్వ శర్మ చాలా శ్రమిస్తున్నారు. ఆయన శ్రమ వల్లే ఇప్పుడు అసోం ఆరోగ్య రంగంలో స్వయం సమృద్ధిని సాధించింది. అసోం ప్రజలు మెరుగైన వైద్యం కోసం రాష్ట్రం దాటి వెళ్లకుండా స్థానికంగానే వైద్య వసతులను కల్పించాలనేది తన లక్ష్యమని సీఎం హిమంత నాతో చెప్పారు. బంగాల్, ఈశాన్య రాష్ట్రాల పేద రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించే స్థాయికి అసోంను తీసుకెళ్లాలనే విజన్‌తో హిమంత ఉన్నారు. గతంలో అసోం ప్రజలు క్యాన్సర్ చికిత్స కోసం చెన్నై, ముంబయి, కర్ణాటక, దిల్లీలకు వెళ్లేవారు. కానీ ఇప్పుడు సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ఆ చికిత్సను పొందుతున్నారు" అని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తెలిపారు.

**అమిత్‌షా ప్రారంభించిన ప్రాజెక్టులు, పనులు ఇవే!**

గువహటిలో కొత్తగా నిర్మించిన ప్రాగ్‌జ్యోతిష్‌పూర్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్‌ను అమిత్‌షా ఈసందర్భంగా ప్రారంభించారు.

గోలాఘాట్, తీన్ సుకియా క్యాన్సర్ సెంటర్లను హోంమంత్రి ప్రారంభించారు.

దిఫూ, జోర్హాట్, బార్పేటలలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్స్ నిర్మాణ పనులకు అమిత్‌షా వర్చువల్‌గా పునాది రాయి వేశారు.

గువహటిలోని సిక్స్ మైల్ ఏరియాలో స్వాస్థ్య భవన్, అభయపురి జిల్లా ఆస్పత్రి నిర్మాణ పనులకు కేంద్ర హోంమంత్రి పునాది రాయి వేశారు.

# ఎలక్షన్ నోటిఫికేషన్‌కు ముందు మమత కీలక ప్రకటన

బంగాల్ ఎన్నికల షెడ్యూల్‌పై కేంద్ర ఎన్నికల సంఘం ఆదివారం ప్రకటన చేయడానికి కొన్నిగంటల ముందు సీఎం మమతా బెనర్జీ కీలక ప్రకటన చేశారు. హిందూ పురోహితులు, ముస్లిం ముఅజ్జిన్‌ల నెలవారీ గౌరవ వేతనాన్ని మరో రూ.500 చొప్పున పెంచుతున్నట్లు ఆమె వెల్లడించారు. దీని ప్రకారం ఇకపై బంగాల్‌లోని పురోహితులు, ముఅజ్జిన్‌లకు ప్రభుత్వం నుంచి ప్రతినెలా రూ.2వేల గౌరవ వేతనం లభించనుంది. ఈమేరకు వివరాలతో ఎక్స్ వేదికగా సీఎం మమతా బెనర్జీ ట్వీట్ చేశారు. పురోహితులు, ముఅజ్జిన్‌ల గౌరవ వేతనాలను పెంచే ఆదేశాన్ని ఇచ్చినందుకు తనకు సంతోషంగా ఉందని ఆమె వెల్లడించారు. ఈ సమాజపు ఆధ్యాత్మిక, సామాజిక జీవితాల కోసం పురోహితులు, ముఅజ్జిన్‌లు ఎన్నో సేవలు అందిస్తున్నారని మమత కొనియాడారు. గౌరవ వేతనం కోసం పురోహితులు, ముఅజ్జిన్‌లు కొత్తగా సమర్పించిన అన్ని దరఖాస్తులనూ ఆమోదించామన్నారు. మత సామరస్యం, సంప్రదాయ వ్యవస్థలకు మద్దతు అనేవి తమ ప్రభుత్వానికి అత్యంత కీలకమైన అంశాలని ఆమె స్పష్టం చేశారు. ప్రతీ సామాజిక వర్గం, సంప్రదాయం వర్ధిల్లే అనుకూల వాతావరణాన్ని ఏర్పర్చేందుకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సుసంపన్నమైన మన ఆధ్యాత్మిక వారసత్వానికి సంరక్షణకర్తలుగా వ్యవహరిస్తున్న పురోహితులు, ముఅజ్జిన్‌లు గౌరవ వేతనాలకు అర్హులని సీఎం మమత చెప్పారు.

**ఈనెల నుంచే ఉద్యోగులు,**



**పెన్షనర్లకు డీఏ బకాయిలు**

"మాది మా - మాటీ - మనుష్ ప్రభుత్వం. మేం ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాం. ప్రభుత్వ విద్యాసంస్థల లక్షలాది టీచర్లు, నాన్ టీచింగ్ సిబ్బంది, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, స్థానిక సంస్థల్లోని ఎయిడెడ్ విద్యా సంస్థల ఉద్యోగులు, పెన్షనర్లకు ఇచ్చిన వాగ్దానాలను కూడా నిలబెట్టుకున్నాం. వాళ్లంతా ఆర్ఓపీఏ 2009 కరవు భత్యం (డీఏ) బకాయిలూ 2026 మార్చి నెల నుంచి అందుకుంటారు. రాష్ట్ర ఆర్థిక శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌లోని మార్గదర్శకాల ప్రకారం ఉద్యోగులు, పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగులకు డీఏ బకాయిలు అందుతాయి" అని సీఎం మమత వెల్లడించారు.

**సుప్రీం కోర్టు ఆదేశాల ఎఫెక్ట్**

ఐదో వేతన సంఘం సిఫారసులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల చెల్లింపులు, ప్రయోజనాలలో సవరణలు చేసేందుకు రూపొందించిన మార్గదర్శకాలనే రివిజన్ ఆఫ్ పే అండ్ అలవెన్స్ (ఆర్ఓపీఏ) అంటారు. వీటిని అమలు చేయకపోవడాన్ని వ్యతిరేకిస్తూ బంగాల్‌కు చెందిన ఒక ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆర్ఓపీఏ మార్గదర్శకాల ప్రకారం 2008 ఏప్రిల్ 1 నుంచి 2019 డిసెంబరు 31 వరకు పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం బకాయిలను ఉద్యోగులు, పెన్షనర్లకు అందించాలని కోరింది. ఉద్యోగ సంఘం వాదనతో ఏకీభవించిన సుప్రీంకోర్టు ధర్మాసనం, 2026 మార్చి 31లోగా 25 శాతం డీఏ బకాయిలను విడుదల చేయాలని బంగాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని 2025 మేలో ఆదేశించింది. మిగతా 75 శాతం డీఏ బకాయిలపై నిర్ణయాన్ని తీసుకోవడానికి నలుగురు రిటైర్డ్ జడ్జీలతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయమని బంగాల్ సర్కారుకు సుప్రీంకోర్టు నిర్దేశించింది. ఈనేపథ్యంలో డీఏ బకాయిలను ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు అందించాలని సీఎం మమత ఆదేశాలు జారీ చేశారు. ఈనెలలోనే వాళ్లందరికీ డీఏ బకాయిలు అందుతాయని వెల్లడించారు. సరిగ్గా అసెంబ్లీ ఎన్నికల వేళ ఉద్యోగులు, పెన్షనర్లను ప్రసన్నం చేసుకునేందుకే మమత ఈ నిర్ణయాన్ని తీసుకున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. బంగాల్ ఎన్నికల షెడ్యూల్‌పై ఈసీ ప్రకటన తర్వాత ఆదివారం సాయంత్రం నుంచి రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రానుంది.

# విదేశాల్లో ఉన్న సొంత పౌరుల రక్షణలో భారత్ మేటి



ప్రపంచంలోని ఏ మూలన సంక్షోభం తలెత్తినా, యుద్ధ మేఘాలు కమ్ముకున్నా... అక్కడ చిక్కుకుపోయిన తమ పౌరులను కాపాడుకోవడంలో భారత్ అత్యంత చురుగ్గా, వేగంగా స్పందించే దేశంగా ముందు వరుసలో నిలుస్తోందని ఓ తాజా నివేదిక ప్రశంసించింది. ఈ విషయంలో భారత ప్రభుత్వం చూపుతున్న నిబద్ధత, సమన్వయంతో కూడిన భారీ తరలింపు చర్యలు ప్రపంచవ్యాప్తంగా దేశ కీర్తిని పెంచుతున్నాయని 'టైమ్స్ కువైట్' తన కథనంలో పేర్కొంది. కేవలం తమ పౌరులనే కాకుండా, అత్యవసర సమయాల్లో విదేశీయులను సైతం సురక్షితంగా తరలించి భారత్ తన మానవతా దృక్పథాన్ని, అంతర్జాతీయ సంఘీభావాన్ని చాటుకుంటోందని ఆ నివేదిక కొనియాడింది. వేగవంతమైన దౌత్యపర మైన చర్చలు, ప్రభుత్వ ఏజెన్సీల మధ్య అద్భుతమైన సమన్వయం, సమర్థవంతమైన సైనిక లాజిస్టిక్స్‌తో వేలాది మంది భారతీయులను ప్రమాదకర పరిస్థితుల నుంచి సురక్షితంగా స్వదేశానికి చేర్చగలిగిందని వెల్లడించింది. ఇటీవలి కాలంలో చేపట్టిన ఆపరేషన్ రాహత్, ఆపరేషన్ సంకట్ మోచన్, ఆపరేషన్ గంగ, ఆపరేషన్ కావేరి వంటివి ఇందుకు నిదర్శనమని నివేదిక వివరించింది. 2025 మధ్యలో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు పెరిగినప్పుడు, భారత ప్రభుత్వం 'ఆపరేషన్ సింధు' పేరుతో తమ పౌరులను సురక్షితంగా తరలించింది. సంక్షోభ ప్రాంతంలోని వారిని ముందుగా పొరుగున ఉన్న అర్మేనియాకు తరలించి, అక్కడి నుంచి ప్రత్యేక విమానాల్లో భారత్‌కు తీసుకొచ్చారు. ఈ తరలింపు ప్రక్రియ చాలా సాఫీగా, చక్కటి ప్రణాళికతో జరిగిందని, ప్రయాణ ఏర్పాట్లు చేసేంత వరకు సౌకర్యవంతమైన వసతి కల్పించారని స్వదేశానికి తిరిగి వచ్చిన వారు తెలిపినట్లు నివేదికలో పేర్కొన్నారు. భారత రాయబార కార్యాలయం అందించిన సహాయం చూసి తాను ఆశ్చర్యపోయానని కశ్మీర్‌కు చెందిన సెహ్రిష్ రఫీక్ చెప్పినట్లు టైమ్స్ కువైట్ ఉటంకించింది. 'మా కోసం రాయబార కార్యాలయం ఇంతలా శ్రమిస్తుందని నేను మొదట నమ్మలేకపోయాను. కశ్మీరీలు అందరూ భారత ప్రభుత్వానికి నిజంగా కృతజ్ఞతలు తెలుపుతున్నారు' అని ఆమె అన్నారు. ఈ ఆపరేషన్ ఎంతో సహాయకారిగా ఉందని, తమ భద్రతకు భరోసా ఇచ్చిన ఎంబసీకి పుల్వామాకు చెందిన మీర్ మహ్మద్ ముషారఫ్ కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా, రష్యా-ఉక్రెయిన్ యుద్ధ సమయంలో భారత్ 'ఆపరేషన్ గంగ'ను ప్రారంభించి రికార్డు స్థాయిలో తరలింపు చేపట్టింది. ఈ ఆపరేషన్ ద్వారా 23,000 మందికి పైగా భారత పౌరులతో పాటు 18 దేశాలకు చెందిన 147 మంది విదేశీయులను కూడా సురక్షితంగా తరలించింది. పౌరులను మొదట పోలాండ్, రొమేనియా, హంగరీ, స్లోవేకియా, మోల్డోవా వంటి పొరుగు దేశాలకు చేర్చి, అక్కడి నుంచి ప్రత్యేక పౌర, సైనిక విమానాల్లో భారత్‌కు తీసుకొచ్చారు.

**అదే మా ప్రథమ ప్రాధాన్యత: భారత విదేశాంగ శాఖ**

"విదేశాల్లోని భారత పౌరుల భద్రత, శ్రేయస్సే మా ప్రథమ ప్రాధాన్యత. వారిపై ప్రతికూల ప్రభావం చూపే పరిణామాలను మేము ఉపేక్షించలేము" అని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. గతంలో అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతల సమయంలోనూ భారత ప్రభుత్వం అక్కడి పరిణామాలను నిశితంగా గమనిస్తూ, పౌరుల తరలింపునకు అన్ని మార్గాలను అన్వేషించింది. స్వదేశానికి తిరిగి రావాలనుకునే వారి కోసం విమాన ఛార్జీలను స్థిరంగా, అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంది. ఈ నిరంతర ప్రయత్నాలు, మానవతావాదంతో కూడిన స్పందన... బాధ్యతాయుతమైన ప్రపంచ శక్తిగా భారత్ స్థానాన్ని మరింత పటిష్టం చేస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# కాన్షీరామ్‌కు 'భారతరత్న' ఇవ్వండి

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) వ్యవస్థాపకుడు, బహుజన నేత కాన్షీరామ్‌కు మరణానంతరం భారతరత్న పురస్కారం ప్రదానం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ప్రధానికి ఓ లేఖ రాశారు. కాన్షీరామ్ జయంతిని పురస్కరించుకుని, ఆయన సేవలను స్మరించుకుంటూ ఈ విజ్ఞప్తి చేస్తున్నట్టు రాహుల్ తన లేఖలో పేర్కొన్నారు. భారత రాజకీయాల స్వరూపాన్నే కాన్షీరామ్ మార్చారని రాహుల్ కొనియాడారు. తన ఉద్యమాల ద్వారా బహుజనుల్లో, పేదల్లో రాజకీయ చైతన్యం నింపారని తెలిపారు. వారి ఓటు, గళం, ప్రాతినిధ్యం ఎంతో ముఖ్యమని గుర్తుచేశారని, ఈ దేశం అందరిదీ అని చాటిచెప్పారని వివరించారు. ఆయన కృషి వల్లే ఎందరో అణగారిన వర్గాల ప్రజలు రాజకీయాలను న్యాయం, సమానత్వం సాధించే మార్గంగా చూడటం ప్రారంభించారని పేర్కొన్నారు. ప్రతి భారతీయుడికి రాజ్యాంగం సమానత్వం, గౌరవం, భాగస్వామ్యం కల్పించిందని, ఆ హామీలను సమాజంలో అట్టడుగున ఉన్నవారికి అందించేందుకు కాన్షీరామ్ తన జీవితాన్ని అంకితం చేశారని రాహుల్ గుర్తుచేశారు. ఇటీవల లక్నోలో జరిగిన 'సామాజిక్ పరివర్తన్ దివస్' కార్యక్రమంలోనూ ఈ డిమాండ్‌కు బలమైన మద్దతు లభించిందని ప్రధానికి రాసిన లేఖలో ప్రస్తావించారు. 2027లో యూపీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, కాంగ్రెస్ ఈ అంశాన్ని లేవనెత్తడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. కాన్షీరామ్‌కు భారతరత్న ప్రకటించడం ఆయన దేశానికి చేసిన సేవలకు దక్కే నిజమైన గౌరవమని, ఆయనను సాధికారతకు చిహ్నంగా భావించే కోట్లాది మంది ఆకాంక్షలను నెరవేర్చినట్టు అవుతుందని రాహుల్ తన లేఖను ముగించారు. అయితే, రాహుల్ డిమాండ్‌పై బీఎస్పీ అధినేత్రి మాయావతి విమర్శలు గుప్పించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వంటి దళిత ఐకాన్‌ల గుర్తింపు విషయంలో కాంగ్రెస్ పార్టీ గత రికార్డును ఆమె ప్రశ్నించారు.

# విజయ్‌కు బీజేపీ భారీ ఆఫర్ డిప్యూటీ సీఎం పదవి, 80సీట్లు

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించనున్న నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ వేడి రాజుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో విజయ్? పార్టీ పొత్తు ఉంటుందనని గత కొన్ని రోజులుగా వార్తలొస్తున్నాయి. ఈ క్రమంలో బీజేపీతో కలిసి పోటీ చేసే ప్రసక్తే లేదని టీవీకే పార్టీ స్పష్టం చేసింది. అయినా ఈ పొత్తు వార్తులు వస్తూనే ఉన్నాయి. తాజాగా విజయ్?కు బీజేపీ డిప్యూటీ సీఎం ఆఫర్ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. పొత్తులో భాగంగా టీవీకేకు 80 సీట్లు ఇవ్వనున్నట్లుగా సమాచారం.

**తుదిదశలో బీజేపీ--టీవీకే చర్చలు**

తమిళనాడు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీజేపీ, టీవీకే మధ్య సీట్ల పంపకం చర్చలు తుదిదశకు చేరుకున్నాయని వర్గాలు వెల్లడించాయి. ఈ ఒప్పందం కుదిరితే రాష్ట్ర రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక విజయ్ మాత్రం భవిష్యత్తులో ముఖ్యమంత్రి పదవిని లక్ష్యంగా పెట్టుకున్నారని సమాచారం. ఈ అంశం కూడా ప్రస్తుతం జరుగుతున్న చర్చల్లో ప్రధానంగా ఉన్నట్లు తెలుస్తోంది.

**విజయ్ అభిమాన ఓటు బ్యాంకుపై బీజేపీ దృష్టి**

ఎన్‌డీఏలోకి విజయ్ పార్టీని తీసుకురావడానికి బీజేపీ పలు మార్గాల్లో ప్రయత్నాలు చేస్తున్నట్లుగా సమాచారం. విజయ్‌తో సంప్రదింపులు కొనసాగించేందుకు ఇతర రాష్ట్రానికి చెందిన ఒక డిప్యూటీ ముఖ్యమంత్రి కూడా మధ్యవర్తిగా పనిచేస్తున్నారని తెలుస్తోంది. తమిళనాడులో విజయ్?కు భారీగానే అభిమానులు ఉన్నాయి. ఇదే ఇప్పుడు బీజేపీకి కీలకంగా మారవచ్చని పార్టీ వ్యూహకర్తలు భావిస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో కేవలం 2 శాతం ఓట్ల మార్పు కూడా ఫలితాన్ని ప్రభావితం చేయగలదని పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు. అయితే ఎన్‌డీఏతో పొత్తుపై విజయ్‌కు దగ్గరగా ఉన్న కొందరు సలహాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. స్వతంత్ర రాజకీయ ప్రత్యామ్నాయంగా ప్రజల ముందుకు వచ్చిన కొత్త పార్టీగా టీవీకే తన ప్రతిష్ఠను నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందని భావిస్తున్నారు. ప్రారంభ దశలోనే జాతీయ కూటమిలో చేరితే పార్టీ ఇమేజ్ దెబ్బతినే అవకాశం ఉందని భావిస్తున్నట్లుగా సమాచారం.

# 2027 జనాభా లెక్కల శిక్షణ తరగతులు ప్రారంభం

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :**





వికారాబాద్ కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జనాభా లెక్కలు 2027, శిక్షణ తరగతుల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా డి ఆర్ ఓ, జడ్ పి సి ఇ ఓ సుదీర్ హాజరయ్యారు, జ్యోతి ప్రజల్వన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డి ఆర్ ఓ మంగీలాల్ మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన విధముగా నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో అధికారులు పక్కాగా సర్వే నిర్వహించి జనాభా గణనచేయాలని, మొదటి దశలో హౌస్ లిస్టింగ్ (ఇండ్ల జాబితా) మే 11 నుండి జూన్ 9 వరకు, రెండవ దశ జనాభా గణన ఫిబ్రవరి 2027వ సంవత్సరంలో జరుగుతుందన్నారు. మార్చి 1,2027 వ తేదీని రిఫరెన్స్ తేదీగా పరిగణిస్తారని, ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు, ప్రణాళికలు రూపొందించడానికి, జనాభా గణాంకాలు కీలకంగా ఉంటాయన్నారు. ఈ గణన దేశంలో మొదటిసారిగా డిజిటల్ విధానం ద్వారా మొబైల్ యాప్, వెబ్ పోర్టల్ల ను ఉపయోగించి ఈ సర్వేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా నమోదు చేసుకునేందుకు ప్రత్యేక పోర్టల్ ను జనాభా గణన ప్రారంభానికి ముందు అందుబాటులో కి తీసుకువస్తామని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాలు మూడు రోజుల పాటుఉంటాయని తెలిపారు. జనాభా లెక్కల ట్రైనింగ్ ప్రోగ్రాం అంటే ప్రభుత్వం లెక్కలు తీసే ముందు అధికారులు, సర్వేయర్లు (ఏనుమిరేటర్స్), సూపర్వైజర్లు వంటి సిబ్బందికి ఇచ్చే శిక్షణ కార్యక్రమం ఈ ట్రైనింగ్‌లో ప్ర జల వివరాలు ఎలా సేకరించాలి, ఎలా నమోదు చేయాలనే విషయాలు నేర్పుతారు.

### ట్రైనింగ్ ప్రోగ్రాం లో ఏమి నేర్పుతారు

జనాభా లెక్కల విధానం ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు ఎలా తీసుకోవాలి, డిజిటల్ యాప్ ఉపయోగం – ఈసారి ఎక్కువగా మొబైల్ యాప్ ద్వారా డేటా నమోదు చేయడం నేర్పుతారు. ప్రశ్నలు ఎలా అడగాలి, కుటుంబ సభ్యుల వివరాలు, విద్య, ఉద్యోగం, గృహ వివరాలు ఎలా అడగాలి. డేటా భద్రత వ్యక్తిగత సమాచారాన్ని రహస్యంగా ఎలా ఉంచాలి. ఎన్యూమరేషన్ బ్లాక్ పని ప్రతి సర్వేయర్‌కు 150–180 ఇళ్ల వరకు బాధ్యత ఉండవచ్చు. ట్రైనింగ్ సాధారణంగా 2–3 రోజులు లేదా కొన్ని రోజులు క్లాస్ ట్రైనింగ్ ఉంటుంది. మాస్టర్ ట్రైనర్లు ఫీల్డ్ ట్రైనర్లు, ఎన్యూమరేటర్లు అనే మూడు స్థాయిల్లో శిక్షణ ఇస్తారు. ప్రాక్టికల్‌గా మొబైల్ యాప్, ఫారమ్ ఎలా నింపాలో చూపిస్తారు. జనాభా లెక్కల దశలు (భారతదేశం)

1. హౌస్ లిస్టింగ్ అండ్ హౌసింగ్ సెన్సస్ – ఇళ్ల వివరాలు (2026 నుంచి ప్రారంభం).

2. పాపులేషన్ ఎన్యూమరేషన్ – ప్రతి వ్యక్తి వివరాలు నమోదు (2027లో).

ఈ ట్రైనింగ్ పూర్తయిన తర్వాత సిబ్బంది ఇంటింటికి వెళ్లి జనాభా లెక్కలు సేకరిస్తారు. జనాభా లెక్కల అధికారులు శ్రీకాంత్ నాయక్, వంగ పందు గీత పి పి టి ద్వారా శిక్షణ నిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్ పి సి ఇ ఓ సుధీర్, ముఖ్య ప్రణాళిక అధికారి వెంకటేశ్వర్లు, తాండూర్ డి ఆర్ ఓ అనిత, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, రవి చంద్ర, రాఘవేందర్ రెడ్డి, అన్ని మండలాల తహసీల్దార్ లు, డిప్యూటీ తహసీల్దార్ లు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:**

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరు బాధ్యతను చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. ఆదివారం రోజు చేవెళ్ల మున్సిపాలిటీ 13వ వార్డు (కేసారం)లో నిర్వహిస్తున్న "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల" కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోడ్లను శుభ్రం చేస్తూ... ప్రజలకు పరిశుభ్రత ప్రాముఖ్యతను తెలియజేసిన ఎమ్మెల్యే యాదయ్య. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ... గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

- సూర్యాపేట మున్సిపాలిటీని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తాం
- పచ్చదనం, పరిశుభ్రత కు ప్రాధాన్యత ఇస్తాము
- పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణ చేస్తాం
- దశల వారి గా ప్రతి వార్డును అభివృద్ధి చేస్తాము....
- ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :**

సూర్యాపేట పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఖచ్చితంగా అమలు చేస్తామని ఆయన చెప్పారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని 36 వార్డు హౌసింగ్ బోర్డ్ కాలనీలో జరిగిన ఉప్పలమ్మ తల్లి పూజా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.. మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, వార్డు కౌన్సిలర్ ఫరూక్, కౌన్సిలర్ లు కొండపల్లి దిలీప్ రెడ్డి, కొణతం రాజేష్ లు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ సూర్యాపేట పట్టణంలోని ప్రతి వార్డులో క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నామని వార్డు ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు. పట్టణ ప్రజాపాలన పట్టణ ప్రణాళిక కార్యక్రమంలో వార్డులలో పచ్చదనం, పరిశుభ్రత కు ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన చెప్పారు. పట్టణం ప్రశాంతంగా ఉంటేనే ప్రజలు జీవించడానికి ఇష్టపడతారని, అటువంటి పరిస్థితులను సూర్యాపేటలో కల్పిస్తామని ఆయన చెప్పారు. సూర్యాపేట లో శాంతి భద్రతల పరిస్థితి పై దృష్టి సారించామని, పట్టణంలో ఎక్కడైనా బహిరంగంగా మద్యం సేవించిన, గంజాయి బ్యాచులు తిరిగిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో మహిళలను వేధించిన, ఈవ్ టీజింగ్ వంటి చర్యలకు పాల్పడిన అటువంటి వారిపై చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరిస్తామని ఆయన హెచ్చరించారు. సూర్యాపేటలో పార్కుల అభివృద్ధికి 20 కోట్ల రూపాయలు మంజూరు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరినట్లు ఆయన తెలిపారు. వార్డు కౌన్సిలర్ కాలనీవాసులు కోరినట్లు కాలనీని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.ప్రతి వార్డులో సమస్యల పరిష్కారం చేస్తామని, దశల వారీగా వార్డుల అభివృద్ధి చేస్తామని చెప్పారు. సూర్యాపేటలో డ్రైనేజీ తవ్వకాలు వల్ల రోడ్డు దెబ్బతిన్న మాట వాస్తవమేనని,రోడ్ల పరిస్థితిని మార్చటానికి ఎల్లవేళలా కృషి చేస్తామని అన్నారు సామూహిక ఉత్సవాలు చేసుకోవడం వల్ల ప్రజలలో ఐకమత్యం పెరుగుతుందని, కులాలకు మతాలకు అతీతంగా పండగలు జరుపుకునే సంస్కృతి సూర్యాపేటలో ఉందని ఆయన అన్నారు. కాలనీలో రిటైర్ అయిన వారిని సన్మానించుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో కాలనీ ప్రజలు పాల్గొన్నారు

# మల్టీ పర్పస్ వర్కర్ల సేవలు అభినందనీయం



**ఖమ్మం, రాజముద్ర న్యూస్**

పగలు,రేయనకా కష్టపడి గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్న గ్రామ పంచాయితీ మల్టీ పర్పస్ వర్కర్లు(కార్మికులు) సేవలు అభినందనీయం అని కూసుమంచి మండలం లోని లాల్ సింగ్ తండా సర్పంచ్ భూక్యా సావిత్రి అన్నారు.99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆదివారం మల్టీ పర్పస్ వర్కర్లను శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో మల్టీ పర్పస్ వర్కర్ల దే కీలక పాత్రని ఉదయం లేచిన దగ్గర నుండి పడుకునే వరకు అన్ని రకాల పారిశుధ్య కార్యక్రమాలని నిర్వర్తిస్తున్నారని తెలిపారు.అనంతరం మల్టీ పర్పస్ వర్కర్లకి యూనిఫాం,మాస్క్ లు,బూట్లు,గ్లౌస్ లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి నిమ్మకాయల మధు,ఉప సర్పంచ్ గుగులోత్ వసంత,మాజీ సర్పంచ్ ధరావత్ వెంకట్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు భూక్యా కోటేశ్వర రావు,వార్డు సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.



# సిఐని కలిసిన బిఆర్ఎస్ నాయకులు

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:**

శంకర్ పల్లి నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన మీర్ ముదసర్ అలిని మర్యాదపూర్వకంగా కలిసిన శంకర్ పల్లి మండల, మున్సిపల్ బిఆర్ఎస్ నాయకులు. నూతన సిఐని కలిసి శాలువాతో సన్మానించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో శంకర్ పల్లి మున్సిపల్, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు బి శశిధర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, మాజి ఎంపిపి నర్సింలు, బిఆర్ఎస్ సినియర్ నాయకులు వాసుదేవ్ కన్నా, ఉపేందర్ రెడ్డి, మహేందర్ రెడ్డి , శ్రీకాంత్ రెడ్డి, మైనారిటీ నాయకులు అజ్మత్ తదితరులు ఉన్నారు.

# ఎన్నికల హామీని హామీని నిలబెట్టుకున్న కౌన్సిలర్

**సొంత నిధులతో మట్టి రోడ్డు వేయించిన దూత మల్లేష్**



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:**

చేవెళ్ల మున్సిపాలిటీ 1వ వార్డు కౌన్సిలర్ దూత మల్లేష్ తన ఉదారతను చాటుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మొండివాగు నుంచి ఊరెళ్ల వెళ్లేందుకు రూ.4 లక్షల సొంత నిధులతో మట్టి రోడ్డును వేయించారు. ఆదివారం పనులను ప్రారంభించి, రోడ్డును చదును చేయించారు. దీంతో ఏళ్లనాటి రవాణా కష్టాలు తీరడంతో వార్డు ప్రజలు కౌన్సిలర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుని, రోడ్డును వేయించడం కౌన్సిలర్ పని తీరుకు నిదర్శనమని చెప్పవచ్చు. ఈ కార్యక్రమంలో రఫీక్, నహీం, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం



- చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది,
- మున్సిపల్ కార్యాలయంలో ఉచిత వైద్య పరీక్షల శిబిరం

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్**

పట్టణ పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు మున్సిపాలిటీ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది తెలిపారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికుల కోసం నిర్వహించిన ఉచిత వైద్య పరీక్షల శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా కార్మికులకు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందించారు.అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య కార్మికులు ప్రతిరోజూ కష్టపడి పనిచేస్తున్నారని అన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణలో వారి సేవలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. అందువల్ల వారి ఆరోగ్యం కాపాడటం కూడా మున్సిపాలిటీ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు.పారిశుధ్య కార్మికులు రోజువారీ పనుల్లో భద్రతా నియమాలను పాటిస్తూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. అవసరమైనప్పుడు వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. పారిశుధ్య కార్మికులు ప్రతిరోజూ ప్రజల ఆరోగ్యం కోసం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. వారి ఆరోగ్య రక్షణ కోసం ఇటువంటి వైద్య శిబిరాలను నిర్వహించడం అవసరమన్నారు. భవిష్యత్తులో కూడా కార్మికుల సంక్షేమం కోసం మున్సిపాలిటీ తరపున మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.ఇలాంటి వైద్య శిబిరాలను తరచూ నిర్వహిస్తూ పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తామని, వారి సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ సిఎచ్. హన్మంతరెడ్డి,వైస్ ఛైర్మెన్ యం. డి. షఫీ ఉల్లా, 40 వ వార్డు కౌన్సిలర్ కొణతం రాజేష్ రెడ్డి, శానిటేరి ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఎన్విరాన్ మెంట్ ఇంజనీర్ శివ ప్రసాద్ వైద్య అధికారులు,సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

# కార్మికులకు సన్మానం

**రామారెడ్డి , రాజ ముద్ర న్యూస్**

రామారెడ్డి మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ పారిశుద్ధ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, పరిశుద్ధ కార్మికులకు సన్మానం చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండి ప్రవీణ్, ఎం పి ఓ తిరుపతిరెడ్డి, అన్ని గ్రామాల సర్పంచులు, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.



# పంచాయతీ సిబ్బందికి సన్మానం




**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:**

చేవెళ్ల మండల పరిధిలోని అంతారం గ్రామంలో, గ్రామ అభివృద్ధి, పారిశుధ్య కార్యక్రమాల్లో పని చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బందిని ఆదివారం రోజు గ్రామ సర్పంచ్ జుట్టు రామస్వామి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.... పరిశుద్ధ కార్మికులు నిరంతరం గ్రామ పరిసరాలను శుభ్రంగా ఉంచడంతోపాటు, గ్రామ అభివృద్ధిలో వారి పాత్ర ఎంతో కీలకమని వ్యాఖ్యానించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో వారి సేవలు మరువలేనివని ఆయన పారిశుద్ధ కార్మికులను కొనియాడారు. పారిశుద్ధ కార్మికుల శ్రమ వల్ల ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉంటుందని, గ్రామస్తులు వారి సేవలను మరవకూడదని, వారి శ్రమకు గ్రామస్తుల సహకారం తోడైతే గ్రామాలను మరింత పరిశుభ్రంగా ఉంచవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జుట్టు రామస్వామి, పంచాయతీ కార్యదర్శి నామ శ్రీకాంత్ పాల్గొని వారి సేవలను ప్రశంసించారు. అనంతరం పారిశుధ్య పనులకు అవసరమైన సరుకులను సిబ్బందికి అందజేశారు. గ్రామ స్వచ్ఛతకు కృషి చేస్తున్న వారికి అభినందనలు తెలిపారు.

# నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు



వికారాబాద్, రాజముద్ర న్యూస్ : వికారాబాద్ జిల్లా కలెక్టర్, చైర్మన్ జిల్లాలోని షెడ్యూల్డు కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ దీపక్ తీవరి తెలిపారు. ఆర్థిక పురోగతి పెంపొందిచాలనే లక్ష్యంతో షెడ్యూల్డు కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్, వికారాబాద్ జిల్లా ఎస్.సి. యాక్షన్ ప్లాన్ 2025-26 (కింద రూ.1.00 లక్ష రూపాయల వరకు ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనాలు (90శాతం సబ్సిడీ), రూ.3.00 లక్షల విలువ గల (తిచక్ర ఎలక్ట్రికల్ ఆటో (ప్యాసింజర్, గూడ్స్) వాహనాలు (70 శాతం సబ్సిడీ), రూ.3.00 నుండి రూ.7.00 లక్షల (రూ.5.00 లక్షల వరకు 60 శాతం సబ్సిడీ) విలువ గల సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్, వ్యవసాయ అనుబంధ భాగాల యూనిట్లను లోన్లు వయస్సు 21-50 సంవత్సరాలు కల అభ్యర్థులు ఉపాధి హామీ పథకాలకు 21-60 సంవత్సరాలు కల అభ్యర్థులు భూసంబంధ, వ్యవసాయ, సోలార్ పరికరాల పథకాలకు దరఖాస్తు చేసుకొనగలరు. అభ్యర్థి సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ, మున్సిపాలిటీ ప్రాంతాల వారికి రూ.2.00 లక్షలు మించి ఉండరాదు. మీ-సేవ నుండి పొందిన కులం ఒక సంవత్సరం లోపు ఆదాయ ధృవపత్రం, ఆధార్ కార్డ్, ఫుడ్ సెక్యూరిటీ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన దారిద్ర రేఖకు దిగువన కల అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకొనగలరు. అర్హత ఆసక్తికల షెడ్యూల్డు కులాల అభ్యర్థులు TGOBMMS ఆన్లైన్ పోర్టల్ https://tgobmmsnew.cgg.gov.in ద్వారా దరఖాస్తులు నమోదు చేసుకోవచ్చును. ఈ నమోదు ప్రక్రియ మార్చి 17వ తేదీ నుండి మార్చి 24వ తేదీ వరకు అందు బాటులో ఉంటుంది. మరిన్ని వివరాల కొరకు జిల్లాలోని ఎస్.సి.కార్పోరేషన్ కార్యాలయం, వికారాబాద్ జిల్లా, రూమ్ నెం.ఎస్11అండ్ 12, రెండవ అంతస్తు, సమీకృత జిల్లా ఆఫీసుల కార్యాలయము, కలెక్టరేటు ( ఐ డి ఓ సి ) నందు సంప్రదించగలరు. ఇతర వివరములకు 08416-255866 నందు సంప్రదించవలసినదిగా తెలియపరిచినారు.

# ఎంఈఓ అక్బర్ పై వెంటనే చర్యలు తీసుకోవాలి

- పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి కానాపురం రాజేష్

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:**

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు విద్యా సంస్థలకు విచ్చలవిడిగా పర్మిషన్ ఇచ్చిన ఎంఈఓ అక్బర్ పై వెంటనే చర్యలు తీసుకోవాలని పిడిఎస్ యు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కానాపురం రాజేష్ డిమాండ్ చేశారు. ఎంఈఓ విద్య పర్యవేక్షణ నిర్లక్ష్యం వల్ల ప్రైవేట్ విద్యా సంస్థలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. పదవ తరగతి పర్మిషన్ లేకుండానే అడ్మిషన్ చేసుకున్న శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలి. పాఠశాలను రద్దు చేయాలి. పిడిఎస్ యు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖానాపురం రాజేష్. శంకర్ పల్లి మండల కేంద్రంలోని ప్రైవేటు విద్యా సంస్థలు అయినా శ్రీ చైతన్య టెక్నో పాఠశాల, మాస్టర్ మైండ్ స్కూల్, రావుస్ స్కూల్, ఎస్ ఎస్ ఎక్సలెంట్ స్కూల్, పైన పేర్కొన్న ఏ పాఠశాలలో కూడా ఫైర్ సేఫ్టీ లేదు, సరైన వెంటిలేషన్ లేదు, పర్మిట్ లేని బస్సులను నడుపుతున్నారాని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్ యు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖానాపురం రాజేష్ అన్నారు. అదేవిధంగా శ్రీ చైతన్య పాఠశాల హై టెన్షన్ వైర్ల కింద ఉండడంతో దాదాపు 12 సంవత్సరాల తర్వాత పిల్లలకి రేడియేషన్ ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. దీనివలన విద్యార్థుల భవిష్యత్తు అంధకారం అవుతుందని, ఇవన్నీ ఒక ఎత్తు అయితే 10 వ తరగతికి పర్మిషన్ లేకాపోవడం అన్నారు. అయినా అడ్మిషన్స్ తీసుకొని ఇన్ని రోజులు క్లాసులు చెప్పి, పరీక్షలు మాత్రం చేవెళ్ల మండల కేంద్రంలోని సెంటర్స్ లలో రాయిస్తున్నారు. ఇలా విద్యార్థులు శంకర్ పల్లి మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి చేవెళ్లకి సమయానికి చేరుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షకు హడావిడిలో వచ్చే ముందు విద్యార్థులకు ఏదైనా జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారని, ఇదంతా శంకర్ పల్లి ఎంఈఓ కి, రంగారెడ్డి జిల్లా విద్యాధికారి కి తెలియకుండానే జరుగుతుందా అని ప్రశ్నించారు. విద్యార్థి సంఘం నాయకులు బయట పెట్టేంత వరకు తెలుసుకోలేకపోయారు అంటే వారి విద్య పర్యవేక్షణ ఎంత నిర్లక్ష్యంగా ఉందో తేటతెలమైందన్నారు. వీరి నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ పాఠశాలలో కాకుండా విద్యార్థులు ఏలాంటి పర్మిషన్ లేని పాఠశాలలో అడ్మిషన్ తీసుకొని నానా అవస్థలు పడుతున్నారు. ఇలాంటి అధికారుల వల్ల ప్రభుత్వ పాఠశాలలు మూతపడే స్థాయికి వస్తున్నాయని, కాబట్టి దీని అంతటికి కారణమైన ఎంఈఓపై ఉన్నతాధికారులు విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోని రిటైర్మెంట్ బెనిఫిట్స్ నిలిపివేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ( పిడిఎస్ యు) గా డిమాండ్ చేస్తున్నామన్నారు. ఎలాంటి చర్యలు తీసుకోకపోతే పిడిఎస్ యు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో అసెంబ్లీని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల డివిజన్ ఉపాధ్యక్షుడు అశోక్, కార్యదర్శి బొజ్జి శ్రీకాంత్ అన్నారు.



# నమ్మించి వంచించింది.. ఆశ్రయమిచ్చిన ఇంటికే కన్నం..

- 24 గంటల్లోనే నిందితులను పట్టుకున్న బాలానగర్ పోలీసులు!

**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్ :**



"అయ్యో పాపం" అని ఆశ్రయమిస్తే.. అదను చూసి ఆ ఇంటికే కన్నం వేసిన ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. నమ్మిన వారిని మత్తులో ముంచి, లక్షల విలువైన సొత్తుతో ఉడాయించిన కేటుగాళ్లను పోలీసులు 24 గంటల్లోనే అరెస్ట్ చేశారు. బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదర్శ్ నగర్ నివాసితురాలు యర్రమిల్లి హిమ బిందు వద్దకు ఆమె దూరపు బంధువైన చేరకుపల్లి లక్ష్మి సర్వాణి (35) కొద్దిరోజుల క్రితం వచ్చింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నానని చెప్పడంతో మానవత్వంతో హిమ బిందు ఆమెకు తన ఇంట్లోనే ఆశ్రయం కల్పించారు. అయితే, ఈ ఆదరణను ఆసరాగా చేసుకున్న లక్ష్మి సర్వాణి.. ఇంటిని దోచుకోవాలని పథకం పన్నింది. మార్చి 13న ఇంట్లో వారు అప్రమత్తంగా లేని సమయంలో వారికి మత్తు పదార్థం ఇచ్చి స్పృహ కోల్పోయేలా చేసింది. అనంతరం తన అనుచరులైన పర్వతం కిరణ్ కుమార్ (30), కొనపర్తి యశ్వంత్ (19), భారడి దిలీప్ (23) మరియు శివ సహాయంతో ఇంట్లోని విలువైన బంగారు, వెండి ఆభరణాలను దోచుకుని పరారైంది. బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన బాలానగర్ క్రైమ్ పోలీసులు సాంకేతిక ఆధారాలను (CCTV, సెల్ టవర్ డేటా) విశ్లేషించారు. నిందితులు తప్పించుకునే లోపే శనివారం వారిని అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన సూత్రధారి లక్ష్మి సర్వాణితో పాటు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేయగా, శివ అనే వ్యక్తి ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. నిందితుల వద్ద నుండి పోలీసులు భారీగా రికవరీ చేశారు మొత్తం విలువ సుమారు రూ. 15.50 లక్షలుగా తెలిపారు. అందులో బంగారం: 30 తులాలు, వెండి: 2.3 కిలోలు, 4 సెల్ ఫోన్లు ఉన్నాయి. కేసు నమోదైన 24 గంటల వ్యవధిలోనే దొంగలను పట్టుకుని, సొత్తును స్వాధీనం చేసుకున్న బాలానగర్ సీఐ నర్సింహా రాజు, క్రైమ్ బృందాన్ని ఏసీపీ నరేష్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సిబ్బందికి నగదు పురస్కారాలను అందజేశారు.

# వినియోగదారుల మన్ననలు పొందాలి



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్**

వినియోగదారులకు నాణ్యమైన వస్త్రాలను అందించి వారి మన్ననలను పొందాలని చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి, ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్ లు అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 31 వ వార్డు మాంగల్య షాపింగ్ మాల్ సమీపంలో 62వ మినిస్టర్ వైట్ షోరూంను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో అధునాతన కలెక్షన్స్ తో నిత్య నూతన వెరైటీలతో అతిపెద్ద స్టోర్ గా మినిస్టర్ వైట్ అవతరించిందని అన్నారు. ఈ స్టోర్ ను సూర్యాపేటలో ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. సూర్యాపేటలో ఈ స్టోర్ దినదిన అభివృద్ధి చెందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ బిజినెస్ ఆఫీసర్ సురేష్ రామసుబ్రహ్మణ్యం, మేనేజర్ వెంకటేష్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యండి అంజద్ అలి, మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, నాగుల వాసు, సంద్రపాటి విజయ్, కొనతం రాజేష్, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ళ కరుణాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫారూఖ్, రాచకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలి : ట్రాఫిక్ ఎస్ఐ

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్**

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట పట్టణం కొత్త బస్టాండ్ ప్రాంగణంలో సూర్యాపేట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియమాల పట్ల వాహన డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ మాట్లాడుతూ 99 రోజుల కార్యచరణ కార్యక్రమాలలో పోలీస్ శాఖ తరపున వాహనదారులకు, డ్రైవర్లకు, ప్రజలకు రోడ్డు భద్రత పట్ల అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రోడ్డు భద్రతా ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించడం జరిగిందన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ చెప్తూ ఉన్న పరిస్థితులను ప్రమాదాలను అడ్డంకులను గమనించాలని సూచించారు ద్విచక్ర వాహనంపై ప్రయాణించే వారు హెల్మెట్ ధరించాలని తెలిపారు తప్పుడు మార్గంలో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలియజేశారు.ప్రజలు రోడ్డు నియమ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నుండి రక్షణ పొందాలని ప్రతి ఒక్కరు సురక్షిత గమ్యం చేరుకోవాలని కోరారు.

# జాతీయ సేవా రత్న అవార్డుకు ఎంపికైన కమ్మెట మాజీ సర్పంచ్

**చేవెళ్ళ, రాజముద్ర న్యూస్:**



బహుజన సాహిత్య అకాడమీ జాతీయ సేవా రత్న' అవార్డుకు చేవెళ్ల మండల పరిధిలోని కమ్మెట గ్రామ మాజీ సర్పంచ్ పట్లోళ్ల హనుమంత్ రెడ్డిని ఎంపిక చేశారు. నాయకునిగా కాకుండా ప్రజా సేవాకునిగా సామాజిక వివిధ కార్యక్రమాలు చేస్తూ సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా ఆదివారం మహిమాన్వితుడు తిరుపతి ఏడుకొండల వెంకన్న సన్నిధిలో అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ.. సమాజంలో వివిధ రంగాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మట్టిలో మాణిక్యాలను వెలికితీసి, అవార్డులతో ప్రోత్సహించడం అకాడమీ ముఖ్య ఉద్దేశమని స్పష్టంచేశారు. తమ అకాడమీ ప్రతీ ఏటా ప్రత్యేక కార్య క్రమాలు నిర్వహించి దేశ వ్యాప్తంగా అవార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ... పదవిలో ఉన్నా లేకున్నా ప్రజలకు సేవ చేయడమే తమ ప్రధాన లక్ష్యం అని అన్నారు. ఇంతకాలం తన స్వగ్రామం కమ్మెటకు సేవకునిగా పనిచేశానని చెప్పారు. ఇకముందు కూడా ప్రజలకు ఏ అవసరం ఉన్నా తన ఇంటి తలుపు తడితే తోచిన రీతిగా సహాకారం అందిస్తూ... ప్రజా సేవకునిగా ప్రజల్లో ఒక్కనిగా పని చేస్తానని హామీ ఇచ్చారు. అవార్డుకు ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ...సంతోషం వ్యక్తం చేశారు

# రోజురోజుకు మహిళలపై పెరుగుతున్న దాడులు

- చట్టాలు అమలు చేయడంలో పాలకుల నిర్లక్ష్యం
- అందరికీ సమాన హక్కులు కల్పించలి
- ఐద్వా మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :**

ఐద్వా మహిళా సంఘం సభ్యత్వం సందర్భంగా వికారాబాద్ పట్టణ కేంద్రంలో మధు కాలనీ, రిక్షా కాలనీలో మహిళా సంఘం సభ్యత్వం చేస్తూ వికారాబాద్ జిల్లా కార్యదర్శి ఎం అనసూయ అధ్యక్షతన జెండా ఆవిష్కరణను చెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా ఐద్వా మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి పాల్గొని మాట్లాడుతూ దేశంలో మహిళపై రోజు రోజుకు దాడులు, హత్యలు, అత్యాచారాలు, వరకట్నం వేధింపులు, విడాకులు రోజు రోజుకు పెరుగుతున్నవని, మహిళలకు అనేక చట్టాలు ఉన్న వాటిని అమలు చేయడంలో ఈ పాలకులు నిర్లక్ష్యం చేస్తూ నిందితులకు వత్తాసు పలుకుతూ చట్టాలను నీరుగుర్తిస్తున్నారని అన్నారు. స్త్రీ, పురుష బాధలు పోవాలి అందరికీ సమాన హక్కులు కల్పించిన నాడే ఉన్న చట్టాలను అమలు చేసినదే దేశంలో మహిళలకు నిజమైన స్వతంత్రం వచ్చినట్లు అన్నారు. దేశంలో రాష్ట్రంలో వంట గ్యాస్ ధరలు పెంచుతూ మహిళలను ఇబ్బందులు పెడుతున్నారని పేర్కొన్నారు. అందరికీ 2500 వృతి ఇవ్వాలని తెలిపారు.

**డ్వాక్రా రుణాలు మాఫీ చేయాలి**

అర్హులైన వారికి కొత్త పింఛన్లు ఇవ్వాలని, ఉపాధి హామీ కూలీలకు రోజుకు కూలి 600వందలు ఇవ్వాలని పేర్కొన్నారు. 200పని దినాలు పెంచి, రైతు భరోసా రైతు బంధు రైతు రుణమాఫీ చెయ్యాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్ లలో మహిళలకు ప్రత్యేక బడ్జెట్ పెట్టాలని, సమాజంలో సగభాగం మహిళల అభివృద్ధికి ఖర్చు చెయ్యాలనీ డిమాండ్ చేశారు. మహిళలు, యువతులు మన హక్కుల కోసం అడిగేందుకు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళల నాయకురాలు అనసూయ, రమాదేవి, వెంకటమ్మ, శాంతమ్మ, పద్మమ్మ, యాదమ్మ, అరుణ, జ్యోతి, అండాలు, లక్ష్మీ, సుజాత, సువర్ణ, పద్మ, నీలమ్మ, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**బీర్కూర్, రాజముద్ర న్యూస్**



బీర్కూర్ మండలం అన్నారం గ్రామంలో శనివారం రాత్రి అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిపోయి నష్టపోయిన మచ్చుకూరి కిష్టయ్య బాధిత కుటుంబానికి మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్ ఆర్థిక సహాయం అందించారు. గ్రామాన్ని సందర్శించిన ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా తన వంతు సహాయంగా రూ.10,000, 50 కేజీల బియ్యం ఆర్థిక సహాయంఅందజేశారు.అగ్నిప్రమాదం వల్ల ఇంటిలో ఉన్నగృహోపకరణాలు, నిత్యావసర వస్తువులు పూర్తిగా దగ్ధమవడంతో కుటుంబం తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఇలాంటి సమయంలో బాధితులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ద్రోణవల్లి సతీష్ అన్నారు.ప్రభుత్వం కూడా స్పందించి బాధిత కుటుంబానికి తగిన పరిహారం అందించాలని ఆయన కోరారు. అలాగే నాయకులు మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి 5000 రూపాయలు, దండు గంగాధర్ 2000, పందుల రాములు 2000, గుమ్మ లక్ష్మణ్ వేయి రూపాయలు అందజేశారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, యువకులు పాల్గొన్నారు

## ఐసీసీ టోర్నీల్లో

# భారత్ దూకుడు కొనసాగుతుంది : రోహిత్ శర్మ




అంతర్జాతీయ క్రికెట్‌లో భారత జట్టు ఇటీవలి సంవత్సరాల్లో విశేష విజయాలను నమోదు చేస్తోంది. ఈ నేపథ్యంలో భారత జట్టు ప్రదర్శనపై భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం ఆయన ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ కు బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు.ఇటీవలి కాలంలో ఐసీసీ టోర్నీల్లో భారత జట్టు ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోందని రోహిత్ పేర్కొన్నారు. ఆయన మాటల్లో, గత కొన్నేళ్లుగా అంతర్జాతీయ క్రికెట్‌లో భారత జట్టు నిరంతరం మంచి ఫలితాలు సాధిస్తూ ముందుకు సాగుతోందన్నారు. త్రివర్ణ పతాకం ప్రపంచ వేదికలపై ఎగురుతుండటం ప్రతి భారతీయుడికి గర్వకారణమని చెప్పారు.పురుషుల జట్టు ఐసీసీ టీ20 ప్రపంచకప్ ను వరుసగా రెండుసార్లు గెలుచుకోవడం గొప్ప విజయమని ఆయన పేర్కొన్నారు. అలాగే హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వంలోని భారత మహిళా జట్టు తొలిసారిగా మహిళల వన్డే ప్రపంచకప్ ను సొంతం చేసుకోవడం చారిత్రాత్మక ఘట్టమని అభినందించారు. ముంబైలో జరిగిన ఆ ఫైనల్ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించడం తనకు ఎంతో ఆనందంగా అనిపించిందని రోహిత్ చెప్పారు.అయితే ఇది విజయాల ప్రారంభం మాత్రమేనని, ఇలాంటి స్థాయికి చేరుకున్న తర్వాత మరింత బాధ్యతతో ముందుకు సాగాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. జట్టు సభ్యులందరూ ఇదే దూకుడును కొనసాగిస్తారని తాను నమ్ముతున్నానని తెలిపారు.యువ ఆటగాళ్లకు కూడా రోహిత్ శర్మ సూచనలు చేశారు. అవకాశం వచ్చినప్పుడల్లా దాన్ని వినియోగించుకోవాలని, ప్రతి సవాల్‌ను ధైర్యంగా స్వీకరించాలని చెప్పారు. అంతర్జాతీయ స్థాయికి చేరాలంటే నిరంతర శ్రమ ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. మన దేశంలో క్రికెట్‌లో పోటీ చాలా ఎక్కువగా ఉంటుందని, కాబట్టి చిన్న వయసు నుంచే కష్టపడుతూ ముందుకు రావాల్సి ఉంటుందని రోహిత్ తెలిపారు. ప్రతిభతో పాటు కొన్నిసార్లు అదృష్టం కూడా కలిసి రావాలని, సరైన సమయంలో మన ప్రతిభను గుర్తించే వ్యక్తి ఎదురవడం కూడా ముఖ్యమని అన్నారు. అయితే అదృష్టం కోసం ఎదురు చూడకుండా క్రమశిక్షణతో సాధన చేస్తూ ముందుకు సాగాలని యువ ఆటగాళ్లకు ఆయన సూచించారు.

## ముంబై జట్టు కూర్పుపై

# హర్భజన్ విశ్లేషణ

రాబోయే ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 ప్రారంభానికి ఇంకా కొద్ది రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న ఈ టోర్నీ కోసం క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో పలు జట్ల బలాబలాలపై మాజీ ఆటగాళ్లు తమ అభిప్రాయాలు వెల్లడిస్తున్నారు.ఈ క్రమంలో భారత మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ ముంబై ఇండియన్స్ జట్టు కూర్పుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒక క్రీడా ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, ర్యాన్ రికెల్టన్ మరియు క్వింటన్ డికాక్ ఇద్దరూ ఒకేసారి అగ్ర క్రమంలో ఆడే అవకాశాలు తక్కువగా ఉంటాయని అభిప్రాయపడ్డారు.తన అభిప్రాయం ప్రకారం ఈ ఇద్దరిలో ఒకరికి మాత్రమే తుది జట్టులో చోటు దక్కే అవకాశం ఉందని హర్భజన్ చెప్పారు. జట్టులో రోహిత్ శర్మ వంటి స్థానిక ఆటగాళ్లు ఉన్న నేపథ్యంలో విదేశీ ఆటగాళ్లను అగ్ర క్రమంలో ఒకేసారి ఆడించడం సులభం కాదని పేర్కొన్నారు. పరిస్థితులను బట్టి రోహిత్ శర్మ, రికెల్టన్ లేదా డికాక్‌లో ఒకరితో కలిసి ప్రారంభ బ్యాటింగ్ చేయాల్సి రావచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో జట్టులో ప్రధాన స్పిన్నర్ ఎంపికపైనా హర్భజన్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. అల్లా గజన్‌ఫర్ మరియు మిచెల్ శాంట్నర్ మధ్య ఒకరిని మాత్రమే ప్రధాన స్పిన్నర్‌గా ఎంపిక చేసే అవకాశం ఉందని చెప్పారు. గజన్‌ఫర్ బౌలింగ్‌లో వైవిధ్యం ఎక్కువగా ఉండటం అతనికి అనుకూలంగా మారవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా గజన్‌ఫర్ గురించి చాలా మంది బ్యాటర్లు పూర్తిగా అవగాహన కలిగి లేకపోవడం కూడా అతనికి ప్రయోజనంగా మారవచ్చని హర్భజన్ పేర్కొన్నారు. అయితే పరిస్థితులను బట్టి శాంట్నర్ కూడా కొన్ని మ్యాచ్‌ల్లో జట్టులోకి రావచ్చని ఆయన తెలిపారు.మొత్తానికి రాబోయే ఐపీఎల్ సీజన్‌లో ముంబై ఇండియన్స్ తుది జట్టు కూర్పు ఎలా ఉండబోతుందన్న దానిపై క్రికెట్ వర్గాల్లో ఆసక్తికర చర్చ కొనసాగుతోంది.








## అయ్యర్‌ను వదిలేయడం

# కోల్‌కతా తప్పు

## అనిల్ కుంబ్లే వ్యాఖ్య

రాబోయే ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 ప్రారంభానికి సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో జట్ల వ్యూహాలపై చర్చలు సాగుతున్నాయి. గత సీజన్‌లో ఆశించిన స్థాయిలో ప్రదర్శన చేయలేకపోయిన కోల్‌కతా నైట్ రైడర్స్ ఈసారి బలంగా పుంజుకోవాలనే లక్ష్యంతో ఉంది. అయితే గత సీజన్‌కు ముందు ఆ జట్టు తీసుకున్న ఒక నిర్ణయం పెద్ద తప్పుగా మారిందని భారత మాజీ స్పిన్నర్ అనిల్ కుంబ్లే అభిప్రాయపడ్డారు.
కుంబ్లే వ్యాఖ్యల ప్రకారం, జట్టుకు టైటిల్ అందించిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ను వదులుకోవడం కోల్‌కతా చేసిన ప్రధాన పొరపాటుగా మారింది. రెండు సంవత్సరాల క్రితం ఐపీఎల్ ట్రోఫీ గెలిచిన సమయంలో అయ్యర్ నాయకత్వం జట్టుకు కీలకమైందని ఆయన గుర్తుచేశారు. అదే సమయంలో ఓపెనర్ ఫిల్ సాల్ట్ కూడా జట్టు విజయాల్లో ముఖ్య పాత్ర పోషించాడని తెలిపారు. కానీ ఈ ఇద్దరినీ జట్టులో నిలబెట్టుకోకపోవడం సరైన నిర్ణయం కాదని కుంబ్లే వ్యాఖ్యానించారు.టైటిల్ గెలిచిన తర్వాత కూడా జట్టు రిటెన్షన్ విధానంలో స్థిరత్వం కనిపించలేదని ఆయన విమర్శించారు. కీలక ఆటగాళ్లను వదిలేయడం వల్లే తరువాతి సీజన్‌లో జట్టు బలహీనపడిందని ఆయన అభిప్రాయపడ్డారు.
ఇక 18వ సీజన్‌లో కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన అజింక్యా రహానే అనుభవజ్ఞుడైన ఆటగాడేనని కుంబ్లే పేర్కొన్నారు. దేశవాళీ క్రికెట్‌లో ముంబైకి, అలాగే ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టుకు సారథ్యం వహించిన అనుభవం ఉన్నప్పటికీ టైటిల్ సాధించలేకపోయాడని చెప్పారు. టైటిల్ గెలిపించిన కెప్టెన్‌ను కొనసాగించకపోవడం కోల్‌కతాకు నష్టంగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు.ఇదిలా ఉండగా, ఇటీవల జరిగిన సీజన్‌లో శ్రేయస్ అయ్యర్ రికార్డు ధరకు పంజాబ్ కింగ్స్ జట్టులో చేరి తన నాయకత్వంతో ఆ జట్టును ఫైనల్‌కు తీసుకెళ్లాడు. అయితే టైటిల్ పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చేతిలో ఓడిపోవడంతో పంజాబ్ రన్నరప్‌గా సరిపెట్టుకోవాల్సి వచ్చింది.మొత్తానికి కీలక ఆటగాళ్లను వదులుకోవడం వల్లే కోల్‌కతా గత సీజన్‌లో ఇబ్బందులు ఎదుర్కొన్నదనే అభిప్రాయం క్రికెట్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.





## అంతర్జాతీయ క్రికెట్‌కు సర్ఫరాజ్ అహ్మద్ వీడ్కోలు

పాకిస్థాన్ మాజీ కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్ అంతర్జాతీయ క్రికెట్‌కు అధికారికంగా వీడ్కోలు పలికాడు. గత మూడు సంవత్సరాలుగా జాతీయ జట్టుకు దూరంగా ఉన్న ఆయన తన కెరీర్‌కు ముగింపు పలకాలని నిర్ణయించుకున్నాడు. ఆదివారం ఈ విషయాన్ని ప్రకటించడంతో దాదాపు రెండు దశాబ్దాల క్రికెట్ ప్రయాణానికి ముగింపు పలికినట్లైంది.
పాకిస్థాన్ క్రికెట్‌లో విజయవంతమైన సారథులలో ఒకరిగా గుర్తింపు పొందిన సర్ఫరాజ్ అహ్మద్ అనేక కీలక మ్యాచ్‌లలో జట్టుకు నాయకత్వం వహించాడు. మొత్తం 100కి పైగా అంతర్జాతీయ మ్యాచ్‌లలో కెప్టెన్‌గా వ్యవహరించిన ఆయన తన నాయకత్వంలో జట్టుకు కీలక విజయాలు అందించాడు.
సర్ఫరాజ్ నాయకత్వంలో పాకిస్థాన్ జట్టు 2017లో జరిగిన ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2017లో విజేతగా నిలిచి చరిత్ర సృష్టించింది. అలాగే 2006లో జరిగిన అండర్-19 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ యువజట్టును కూడా విజేతగా నిలిపి ప్రత్యేక గుర్తింపు పొందాడు.
వీడ్కోలు సందర్భంగా సర్ఫరాజ్ మాట్లాడుతూ పాకిస్థాన్ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం తన జీవితంలో అత్యంత గౌరవకరమైన విషయం అని పేర్కొన్నారు. పాక్ జెర్సీ ధరించి ఆడిన ప్రతి క్షణం తనకు ఎంతో ప్రత్యేకమని ఆయన తెలిపారు.
ఇకపై క్రికెట్‌కు సంబంధించిన బాధ్యతలతోనే కొనసాగాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.
ఇప్పటికే పాకిస్థాన్ జూనియర్ జట్టుకు కోచ్‌గా పనిచేసిన ఆయన భవిష్యత్తులో సీనియర్ జట్టుకు కోచ్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నట్లు క్రీడా వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## అభిషేక్‌తో మా జోడీ

# 'ఫైర్-ఫైర్'

## సంజూ శాంసన్




పొట్టి ప్రపంచకప్‌లో భారత జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించిన సంజూ శాంసన్ తన ఓపెనింగ్ భాగస్వామి అభిషేక్ శర్మ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తమ జోడీని చాలామంది 'ఐస్-ఫైర్'గా అభివర్ణిస్తున్నప్పటికీ, నిజానికి తామిద్దరూ అగ్నిలా దూకుడుగా ఆడే బ్యాటర్లు అని సంజూ పేర్కొన్నాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్లో సంజూ శాంసన్ ఓపెనర్‌గా అద్భుత ప్రదర్శన చేశాడు. లీగ్ దశలో ఒకే మ్యాచ్ ఆడిన అతడు సూపర్-8 దశలో జట్టులో స్థానం సంపాదించి వరుస అర్ధశతకాలతో భారత విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా కీలక మ్యాచ్‌లలో అతడి దూకుడు బ్యాటింగ్ జట్టుకు బలాన్నిచ్చింది. అభిషేక్ శర్మతో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించడం గురించి సంజూ మాట్లాడుతూ, "మా జోడీ ఐస్-ఫైర్ కాదు. మేమిద్దరం ఫైర్ ఆటగాళ్లమే. కొన్నిసార్లు అభిషేక్ దూకుడుగా ఆడతాడు, మరికొన్నిసార్లు నేను దాడి చేస్తాను. మా మధ్య మంచి అనుబంధం ఉంది. మైదానంలో కూడా, బయట కూడా అతడితో ఉండటం చాలా సౌకర్యంగా ఉంటుంది" అని చెప్పాడు.అభిషేక్ ధైర్యంగా అన్ని రకాల షాట్లు ఆడగల బ్యాటర్ అని సంజూ ప్రశంసించాడు. మ్యాచ్ సమయంలో కూడా ఇద్దరి మధ్య సరదా సంభాషణలు జరుగుతాయని, బంతి ఎలా వస్తుందో అడిగితే సిక్సర్ కొట్టమని చెప్పేంత సరళంగా తమ మధ్య మాటలు ఉంటాయని తెలిపాడు.ఈ టోర్నీలో కీలక మ్యాచ్‌లలో సంజూ అద్భుతంగా రాణించాడు. సూపర్-8 దశలో వెస్టిండీస్‌పై అజేయంగా 97 పరుగులు చేసి జట్టుకు విజయాన్ని అందించాడు. సెమీఫైనల్లో ఇంగ్లండ్‌పై 89 పరుగులతో మెరిశాడు. ఫైనల్లో కూడా అతడు మరోసారి కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టుకు బలమైన స్కోరు అందించాడు. ఫైనల్ మ్యాచ్‌లో అభిషేక్ శర్మతో కలిసి తొలి వికెట్‌కు 98 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన సంజూ అర్ధశతకంతో జట్టును ముందుకు నడిపించాడు. అనంతరం బౌలింగ్ విభాగంలో జస్ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్ రాణించడంతో ప్రత్యర్థి జట్టు తక్కువ స్కోరుకే పరిమితమైంది. దీంతో భారత జట్టు భారీ తేడాతో విజయం సాధించి పొట్టి ప్రపంచకప్‌ను మూడోసారి సొంతం చేసుకుంది.




### గీత గోవిందం అవకాశం వదిలేసిన లావణ్య త్రిపాఠి

## విజయ్–రష్మికలపై

# ఆసక్తికర వ్యాఖ్యలు

టాలీవుడ్‌కు చెందిన నటి లావణ్య త్రిపాఠి తాజాగా చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంట గురించి ఆమె చెప్పిన మాటలు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న లావణ్య త్రిపాఠి గీత గోవిందం సినిమా గురించి మాట్లాడుతూ ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఈ చిత్రానికి మొదట తననే కథానాయికగా సంప్రదించారని, కానీ అప్పట్లో కథ వినకముందే తాను ఆ అవకాశాన్ని తిరస్కరించానని తెలిపారు.తర్వాత కథ విన్నాక మాత్రం ఆ సినిమాలో నటించాలని అనిపించిందని ఆమె చెప్పారు. అయితే అప్పటికే కొన్ని అపార్థాల కారణంగా ఆ అవకాశం తన చేతుల నుంచి జారిపోయిందని వెల్లడించారు. అదే సందర్భంలో ఆమె మరో ఆసక్తికర వ్యాఖ్య చేశారు. ఆ సినిమా తన దగ్గర నుంచి వెళ్లిపోవడం వల్లే విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న కలిసి నటించే అవకాశం వచ్చిందేమో అనిపిస్తుందని అన్నారు. వాళ్లిద్దరూ నిజంగా చాలా అందమైన జంట అని కూడా ఆమె పేర్కొన్నారు.





గీత గోవిందం సినిమాలో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న కలిసి నటించగా, ఆ చిత్రం భారీ విజయాన్ని సాధించింది. ఈ సినిమా ద్వారానే ఈ జంటకు మంచి గుర్తింపు వచ్చింది. సినిమా సమయంలోనే ఇద్దరి మధ్య మంచి స్నేహం ఏర్పడిందని సినీ వర్గాల్లో అప్పట్లో ప్రచారం జరిగింది. తర్వాత ఈ జంట మరోసారి డియర్ కామ్రేడ్ సినిమాలో కలిసి నటించారు. ఆ సినిమా సమయంలో ఇద్దరి మధ్య మరింత దగ్గరయ్యారనే వార్తలు వినిపించాయి. కొన్నేళ్ల పాటు ప్రేమలో ఉన్న ఈ జంట ఇటీవలే వివాహ బంధంలోకి అడుగుపెట్టినట్లు వార్తలు వెలువడుతున్నాయి.ఇప్పుడు లావణ్య త్రిపాఠి చేసిన ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చకు దారితీశాయి. ఒక సినిమా అవకాశం ఎలా ఇద్దరి జీవితాలను కలిపిందన్న అంశంపై అభిమానుల్లో ఆసక్తికర చర్చ కొనసాగుతోంది.

## రాయ్ లక్ష్మి తాజా చిత్రం

# నెట్టింట వైరల్

నటి రాయ్ లక్ష్మి మరోసారి తన తాజా చిత్రంతో అభిమానుల దృష్టిని ఆకర్షించారు. ఆమె తన సామాజిక మాధ్యమ ఖాతాలో పంచుకున్న ఫోటో ప్రస్తుతం అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది.సముద్రతీరానికి సమీపంలో జరిగిన ఉత్సాహభరితమైన సాయంత్ర వేడుకలో తీసినట్లు కనిపించే ఈ చిత్రంలో రాయ్ లక్ష్మి ప్రకాశవంతమైన పసుపు రంగు దుస్తుల్లో కనిపించారు. చుట్టూ వెలుగులు, సంగీతం మధ్య ఆనందంగా గడుపుతున్న ప్రజల మధ్య ఆమె కెమెరా వైపు స్వల్ప చిరునవ్వుతో ధైర్యంగా నిలబడి కనిపించారు. ఈ ఫోటోకు ఆమె "నియమాలను ఉల్లంఘించడం నాకు ఇష్టం, హృదయాలను కాదు" అనే భావాన్ని వ్యక్తం చేస్తూ వ్యాఖ్యను జత చేశారు.సామాజిక మాధ్యమాల్లో ఎప్పుడూ చురుకుగా ఉండే రాయ్ లక్ష్మి తరచుగా తన ప్రయాణాలు, చిత్రాలు, వ్యక్తిగత క్షణాలను అభిమానులతో పంచుకుంటుంటారు. ఆమె ఖాతాకు పెద్ద సంఖ్యలో అనుచరులు ఉండగా, ఆమె అందం మాత్రమే కాకుండా ఆమె ధైర్యమైన వ్యక్తిత్వం కూడా అభిమానులను ఆకట్టుకుంటుంది.మలయాళ సినీ ప్రేక్షకులకు రాయ్ లక్ష్మి మంచి పరిచయమైన నటి. ఆమె మలయాళంలో పలు ప్రముఖ చిత్రాల్లో నటించారు. రాక్ అండ్ రోల్, అన్నన్ తంబి, టు హరిహర్ నగర్, చట్టంబినాడు, క్రిస్టియన్ బ్రదర్స్ వంటి చిత్రాల ద్వారా ఆమెకు కేరళలో మంచి గుర్తింపు లభించింది.మలయాళ సినిమాలతో పాటు తమిళ, తెలుగు, కన్నడ, హిందీ చిత్రరంగాల్లో కూడా రాయ్ లక్ష్మి నటించారు. పలు భాషల్లో పనిచేసిన నటిగా ఆమె ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఇటీవల ఆమె మలయాళంలో కనిపించిన చిత్రం DNA.ఇటీవల ఒక ఇంటర్వ్యూలో సినీ పరిశ్రమలో చర్చకు వచ్చే 'కాస్టింగ్ కౌచ్' అంశంపై కూడా రాయ్ లక్ష్మి తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఆర్.వి. ఉదయకుమార్ దర్శకత్వంలో తనకు మొదటి అవకాశం లభించిందని, ఆయనను తండ్రి వంటి వ్యక్తిగా భావిస్తానని తెలిపారు. ఆ ప్రారంభం వల్ల తన సినీ ప్రయాణం కొందరితో పోలిస్తే భిన్నంగా సాగిందని ఆమె చెప్పారు. కాస్టింగ్ కౌచ్ గురించి ఎన్నో చర్చలు జరిగినప్పటికీ, తాను వ్యక్తిగతంగా అలాంటి పరిస్థితిని ఎదుర్కోలేదని రాయ్ లక్ష్మి స్పష్టం చేశారు. కొన్నిసార్లు పరిశ్రమలోని ప్రతికూల కథనాలపై ఎక్కువ దృష్టి పడుతుందని, కానీ సినిమా రంగంలో ఎన్నో మంచి అవకాశాలు కూడా ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. ఎక్కువ మంది సినీ రంగంలో పనిచేసే వారు తమ పనిపై ఆసక్తితో పనిచేస్తారని, కొద్ది ప్రతికూల అనుభవాల ఆధారంగా మొత్తం పరిశ్రమను అంచనా వేయకూడదని ఆమె అభిప్రాయపడ్డారు




### బాలీవుడ్‌లో కీర్తి సురేష్ కొత్త చిత్రం

# విడుదలకు సిద్ధం

దక్షిణ భారత చిత్రరంగంలో ప్రముఖ కథానాయికగా గుర్తింపు పొందిన కీర్తి సురేష్ ఇప్పుడు హిందీ చిత్రరంగంలో కూడా తన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో అనేక విజయవంతమైన చిత్రాల్లో నటించిన ఆమెకు బాలీవుడ్‌లో కూడా వరుస అవకాశాలు లభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె నటించిన తాజా హిందీ చిత్రం రఫ్తార్ విడుదల తేదీని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు రాజ్‌కుమార్ రావుతో కలిసి కీర్తి సురేష్ నటిస్తున్నారు. వీరిద్దరూ ఒకే చిత్రంలో కలిసి నటించడం ఇదే మొదటిసారి కావడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. నటనలో ప్రత్యేక గుర్తింపు పొందిన రాజ్‌కుమార్ రావుతో కీర్తి సురేష్ జోడీ ఎలా ఉండబోతుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.చిత్ర బృందం వెల్లడించిన వివరాల ప్రకారం రఫ్తార్ చిత్రం జూలై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. యాక్షన్, భావోద్వేగాలు కలగలిపిన కథతో ఈ చిత్రం రూపొందుతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాను ఆదిత్య నింబల్కర్ దర్శకత్వం వహిస్తున్నారు.ఈ చిత్ర నిర్మాణంలో పత్రలేఖ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. కథకు అనుగుణంగా రాజ్‌కుమార్ రావు యువకుడి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. అతనికి సమానంగా బలమైన పాత్రలో కీర్తి సురేష్ కనిపించనున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి.ఈ చిత్రంలో రాజ్‌కుమార్ రావు, కీర్తి సురేష్‌తో పాటు అనురాగ్ ఠాకూర్, రోహన్ వర్మ, తన్యా మానిక్తలా, రజత్ కపూర్ వంటి నటీనటులు కూడా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కథకు అనుగుణంగా విభిన్నమైన పాత్రలు ఈ సినిమాలో ఉండనున్నట్లు తెలుస్తోంది.ఇక మరోవైపు రాజ్‌కుమార్ రావు ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. త్వరలోనే ఆయన టోస్టర్ అనే చిత్రంలో కనిపించనున్నారు. ఆ చిత్రంలో ఆయన సరసన సన్యా మల్హోత్రా కథానాయికగా నటిస్తున్నారు.మొత్తానికి రఫ్తార్ చిత్రం ద్వారా కీర్తి సురేష్ మరోసారి బాలీవుడ్ ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతోంది. ఈ చిత్రం ఆమెకు హిందీ చిత్రరంగంలో మరింత గుర్తింపు తీసుకువస్తుందా అనే ఆసక్తి సినీ వర్గాల్లో నెలకొంది.





Printed, Published and Owned by RAVU RAJITHA, Printed at KAKATHIYA PRINTERS, LN Colony, Uppal IDA, Uppal. Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com